APTEL/2023/88044

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్


People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 49 | ఎడిటర్ : ఎం. రమేష్ | శనివారం, సెప్టెంబర్ 7, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-



పాఠకులకు, ప్రకటనకర్తలకు, పాత్రికేయులకు, శ్రేయోబిలాషులకూ వినాయకచవితి శుభాకాంక్షలు. పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు, ఆదివారం సంచిక వెలువడదు. తిరిగి సోమవారం పున:దర్శనం.



ఇట్లు .. మీ..
**ఎం. రమేష్‌రెడ్డి,**
ఎడిటర్, పీపుల్స్ మోటివేషన్ తెలుగు దినపత్రిక



వేగంగా పనులు పూరతయ్యేలా చర్యలు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

# 2026 కల్లా భోగాపురం పూర్తి

విజయనగరం, సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్): భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను ప్రతీ నెలా పరిశీలిస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు అత్యంత ప్రాధ్యాన ఇస్తోందని వివరించారు. 2026, జూన్ కల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి చేసే లక్ష్యంతో పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.శుక్రవారం విజయనగరం జిల్లాలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... భోగాపురం ఎయిర్?పోర్టు పనులు ఇప్పటి వరకు 40 శాతం పూర్తయ్యాయని చెప్పారు. ఏపీలో భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదురైనా...పట్టుదలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఉత్తరాంధ్రలో వలసలు అరికట్టేందుకు ఈ ప్రాజెక్ట్ మంచి అవకాశమని అన్నారు. భూములిచ్చిన రైతులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు శాయశక్తులా కష్టపడుతున్నామని అన్నారు.కానీ, బాధ్యతతో ఉండాల్సిన ప్రతిపక్ష నాయకుడు జగన్ రాజకీయం చేస్తున్నారని విమర్శలు చేశారు. అసత్య ప్రచారంతో విషయాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు కూడా కాలేదు..ఇంత పెద్ద విపత్తు వచ్చిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

## వరదనష్టంపై శివరాజ్‌తో సిఎం చంద్రబాబు సమీక్ష

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నష్టం వివరణ
ఎన్డీఆర్ఎఫ్ నిధుల విడుదలలో మార్గదర్శకాలు మార్చాలి
శివరాజ్‌కు సూచించిన సిఎం చంద్రబాబు

విజయవాడ,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్) :



వరద నష్టంపై సచివాలయంలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అధికారులు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించారు.ఏపీలో జరిగిన వరద ప్రభావిత ప్రాంతాల దృశ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా సీఎం, అధికారులు వివరించారు. పలు జిల్లాల్లో ఒకే రోజు అత్యధికంగా 40 సెంటిమీటర్ల వర్షం కురిసిందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. వరద ప్రభావిత జిల్లాలోని గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉందని సీఎం వివరించారు. రోడ్లు, ఇళ్లు, బ్రిడ్జిలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రాకపోకలు స్తంభించాయని సీఎం చంద్రబాబు తెలిపారు. . తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు రూ.10వేలు పంపిణీ చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర పంట నష్టం జరిగిందని, పొలాలన్నీ రాళ్లు, ఇసుక మేటలతో నిండిపోయాయని అధికారులు వివరించారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాలో దెబ్బతిన్న రైల్వే ట్రాక్ పరిస్థితిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఏపీలో వరద నష్టం దాదాపు రూ.5,438 కోట్లు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు కేంద్ర మంత్రికి అధికారులు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ నిధులను రాష్ట్రాలకు విడుదల చేసే విషయంలో ఇప్పుడున్న మార్గదర్శకాలను సడలించాలని సీఎం కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక మరమ్మత్తులకు కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. శాశ్వత పునరుద్ధరణ పనులకూ తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎలా సాయం అందిస్తారో అదే తీరుగా తెలంగాణకూ సాయం అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన వరద నష్టాన్ని ఒకే తీరుగా చూడాలని సీఎం విన్నవించారు. విపత్తుల సమయంలో ప్రజలకు సాయమందించే విషయంలో పార్టీలు, రాజకీయాలు ఉండవని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు

## తెలుగు రాష్ట్రాలను కేంద్రం ఆదుకుంటుంది

కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):



భారీ వర్షాలు, వరదల వల్ల తెలుగు రాష్ట్రాలు బాగా నష్టపోయాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. అన్ని అంశాలు కేంద్రం దృష్టిలో ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం నివేదిక అందిందని చెప్పారు. నివేదికలను పరిశీలించి నిబంధనల ప్రకారం తెలంగాణ, ఏపీకి కేంద్రం సహాయం చేస్తుందని చెప్పారు. హోటల్ హరిత ప్లాజాలో మంత్రి సంజయ్.. మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇది రాజకీయాలతో కూడిన సమస్య కాదని, ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని అన్నారు. 'ఎస్డీఆర్ఎఫ్ నిధులు రూ.1,345 కోట్లు ఉన్నాయి. గత ప్రభుత్వం ఈ నిధులను వాడుకోలేకపోయింది. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం. తెలంగాణను అన్ని విధాలుగా ఆదుకుంటామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు కాబట్టి.. రాజకీయాలను పక్కనపెట్టి తప్పనిసరి పరిస్థితుల్లో సచివాలయానికి వెళ్లాను. గతంలో వరదలు వచ్చినప్పుడు ఎప్పుడూ గత ప్రభుత్వం కేంద్రమంత్రుల్ని పిలవలేదు.. కలవలేదని బండి సంజయ్ అన్నారు.

## పిసిసి అధ్యక్షుడిగా ఎన్నో మధురస్మృతులు ఉన్నాయి

తనపై సోనియా ఉంచిన నమ్మకాన్ని నిజం చేసిన
కొత్త పీసీసీ చీఫ్ మమేశ్‌కు పూర్తి అండగా ఉంటానన్న రేవంత్




వివరాలు 6లో

## తప్పిన వాయుగండం ముప్పు

కొనసాగుతున్న అల్పపీడన ప్రభావం

విశాఖపట్నం,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):

నాలుగు రోజుల క్రితం కురిసిన అతి తీవ్ర వర్షాలతో ముంచెత్తిన వరదల ప్రభావంతో అతలాకుతలం అయిన ఆంధ్రప్రదేశ్‌కు విశాఖపట్నం వాతావరణ కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఏపీకి వాయుగుండం ముప్పు తప్పిందని వెల్లడించింది. దీంతో ఏపీ వాసులు ఊపిరి పీల్చుకున్నట్టు అయింది. కాగా మధ్య బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని, ఇది ఉత్తర దిశగా పయనిస్తోందని తెలిపింది. 9వ తేదీ నాటికి ఇది ఒడిశా- పశ్చిమ బెంగాల్ తీరాలకు అనుకోని వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని చెప్పింది. వాయుగుండం ముప్పు తప్పినప్పటికీ రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర జిలాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అప్రమత్తం చేసింది. అల్లూరి, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ జిల్లాలో కొన్ని చోట్ల భారీ వర్షాలు అవకాశం ఉందని హెచ్చరించింది. శనివారం ఏలూరు, శ్రీకాకుళం, అల్లూరి పార్వతీపురం జిల్లాలలో అక్కడక్కడ వర్షాలు పడే ఛాన్స్ ఉందని తెలిపింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.





## జగన్ లండన్ పర్యటన వాయిదా ?

డిప్లమాట్ పాస్‌పోర్ట్ రద్దు
సాధారణ పాస్‌పోర్ట్ కోసం ఎదురుచూపు
ఐదేళ్ల పాస్‌పోర్టు ఇవ్వాలని కోర్టుల పిటిషన్
విచారణ సోమవారానికి వాయిదా

6

## వరద ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు రావాలి

5

బుడమేరు గండ్లను పూడ్చడం ప్రధాన లక్ష్యం
ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన చంద్రబాబు



## తెలంగాణకు మరో రెండ్రోజులు వర్షసూచన

పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం
శాంతించిన గోదావరి..ఉరకలేస్తున్న కృష్ణమ్మ

5

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# దేశవ్యాప్తంగా ఒకే తరహా విద్య ఉండాలి!

మరోరెండు రోజుల్లో అంటే సెప్టెంబర్ 8న ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం జరుపుకుంటాం. అలాగే సెప్టెంబర్ 5న ఘనంగా గురుపూజోత్సవం జరుపుకున్నాం. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించు కున్నాం. ఏటా ఈ రెండు పండగలను ఘనంగా నిర్వహించుకుంటున్నా విద్య విషయంలో మాత్రం ఏకాభిప్రాయసాధనకు రావడం లేదు. అలాగే విద్యారంగాన్ని పటిష్టం చేయాలన్న ఆలోచన గానీ, జాతీయ విద్యావిధానం తీసుకునిరావాలన్న సంకల్పం కానీ కానరావడం లేదు. దేశాన్ని కట్టి ఉంచడానికి, సమాజా న్ని, ప్రజలను ఒకే గొడుకు కిందకు తీసుకుని రావడానికి, ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి కేవలం విద్య మాత్రమే దోహదం చేస్తుంది. అలాగే విద్యారంగానికి నిధులు కేటాయింపులు పెంచి ఏకీకృత విద్యావిధానం తీసుకుని రావాలి. మనదేశంలో అనేక విద్యావిధానాలు అమలవుతున్నారు. ఒక్కో రాష్ట్రం లో పదిరకాల విద్యావిధానాలు ఉన్నాయి. వీటన్నింటినీ సమీక్షించి, దేశవ్యాప్తంగా ఒకే తరహా విద్యా విధానం ఉండేలా చేయాల్సిన అవసరం ఉంది. కులానికో, మతానికో విద్యావిధానం కూడా సరికాదు. ఉపాధ్యాయులను నియమించి వారిని గౌరవించుకోవడమే గాకుండా పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు విద్యారంగాన్ని బలోపేతం చేసుకోవాలి. నిజానికి అక్షరాస్యతలో దేశం ఇంకా వెనకబడి ఉంది. వెనకబడిన ప్రాంతాలు, గిరిజనప్రాంతాలకు విద్య అందడం లేదు. ఉపాధ్యాయులను ఏటా సత్కరించుకుంటున్నా.. పాఠశాలలను బలోపేతం చేయడంలో కానీ, ఉపాధ్యాయనియామకాల్లో గానీ శ్రద్ధ తీసుకోవడం లేదు. ఉన్న స్కూళ్లను మూసేయడం, క్రమబద్ధీకరించడం చేస్తున్నారు. మారుమూల ప్రాంతా పిల్లలకు సైతం విద్యను నేర్పాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన స్కూళ్లను క్రమబద్ధీకరణ పేరుతో మూసేయడం పాలకుల దాష్టీకానికి నిదర్శనంగా చూడాలి. ప్రైవేట్ రంగంలో విద్యను ప్రోత్సహించి విద్యావ్యాపారానికి పాలకులే తోడ్పడడం దారుణం. ఒకేదేశం, ఒకే పన్ను, ఒకే చట్టం అంటున్న మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కూడా జాతీయ విద్యావిధానం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా అది కూడా సాకారం కావడం లేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రైవేట్ విద్యారంగం బలపడుతోందే తప్ప ప్రభుత్వ విద్యావిధానం పట్టాలకెక్కడం లేదు. దీనికితోడు స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరతతో పాటు, సమస్యలు తిష్టవేసుకు న్నాయి. వీటిని పరిశీలించి పరిష్కరించాల్సిన పాలకులు విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తున్నారు. విద్యారంగంలో మనం ముందుకు పోతున్నామని నాయకులు చెప్పింది నమ్మడానికి లేదు. స్కూళ్లు ప్రారంభమై నాలుగైదు మాసాలైనా ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్యవైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు సబ్జెక్టు టీచర్లు లేరు. రాష్ట్రం లోని కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. నేటికీ అనేక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందడం లేదు. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఇకపోతే ఎపిలో ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోదామని ప్రభుత్కవం భావిస్తున్నా, మరింత వెనకబడి పోవడం ఖాయం. తెలుగుమీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా? అని ఎదురు ప్రశ్న వేస్తున్నా రు. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అని మరో ప్రశ్న. డబ్బున్న వాళ్ళు లక్షల

రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? మరో ప్రశ్న. నిజానికి ప్రభుత్వ విద్యా బలోపేతంగా ఉంటే.. అదీ జాతీయ విధానంగా ఉంటే ఇలాంటి ప్రశ్నలు,మీమాంసలు రావు. దేశమంతా ఒకే విద్యావిధానం రావాలి. ఇకపోతే ప్రాంతీయ భాషల్లో బోధన జరగాల్సిందే. అలాగే దేశానికి ప్రపంచానికి అసవరమైన హిందీ, ఇంగ్లీషల్లో రాటుదేలేలా చేయాలి. ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగుతున్నారు. నిజానికి మాతృభాష లోనే పిల్లలు వేగంగా అర్థం చేసుకుని విషయ పరిజ్ఞానం పెంపొందించుకోగలరని పరిశోధనలు రుజువు చేశాయి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలం దరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి,వారిని గతంలోలాగా గౌరవించే సంస్కృతిని బలోపేతం చేయాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి, సాంప్రదా యాలు నిలబడతాయని అందరి అభిప్రాయం. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకో వాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. మన దేశంలో అన్ని రాష్ట్రాలు వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తున్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చు కోవడంలో తప్పులేదు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్, హిందీభాషలు నేర్పితే సరిపోతుంది. ప్రాంతీయ భాషలు ఏదైనా విద్య అన్నది ఒక్కతీరుగానే ఉండాలి. పాఠ్యాంశాలు ఒక్కటిగా ఉండాలి. బోధనా విధానం ఒక్కటిగానే ఉండాలి. అలాగే దేశ చరిత్ర, పరిణామాలు, సమగ్రంగా భవిష్యత్ తరానికి తెలియచేసేలా విద్యావిధానం ఉండాలి. వీటిని గుర్తించి ఏకీకృత విద్యావిధానం కోసం కేంద్ర,రాష్ట్రాలు సమిష్టిగా కృషిచేయాలి. దేశంలో ఎక్కడికి వెళ్లినా ఒకే తరహా విద్య అందుబాటులో ఉంటే ప్రజల్లో ఏకత సాధించగలం.

# కార్పోరేట్‌కు దీటుగా విద్యారంగం వృద్ధి చెందాలి

**నిధులు వెచ్చించి స్కూళ్లను బలోపేతంచేయాలి**
**టీచర్ల రిక్రూట్‌మెంట్‌తో పరిపుష్టం చేయాలి**

**అమరావతి,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

ప్రభుత్వ విద్యా రంగాన్ని కార్పొరేట్‌కు దీటుగా మార్చాల్సి ఉంది. పాఠశాలల ముఖ చిత్రాన్ని మార్చి వేస్తామని ప్రకటించింది. సూచనల కోసం ఒక నిపుణుల కమిటీని ఉన్నత, పాఠశాల విద్యా వ్యవస్థల్ని పర్యవేక్షించేందుకు, ప్రైవేటు సంస్థల నియంత్రణకు పూనుకోవాలి. నిజానికి మన పాఠశాలలు కనీస వసతుల్లేవు. మన ప్రమాణాలు నానాటికి తీసికట్టుగా మారుతున్నాయి. గ్రామీణులు, పేదలు, కింది వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నారు. మధ్యతరగతికి సైతం చదువు భారంగా మారింది. ఊహించలేనంత అసమానతలు ఒకటో తరగతి నుంచే ఎదురవుతున్నాయి. ప్రస్తుతం చేపడుతున్న పథకాలు, సంస్కరణలు ఈ సమస్యల నుంచి మన పాఠశాల విద్యారంగాన్ని గట్టెక్కించగలిగితే అంతకు మించి ఆశయం మరోటి ఉండదు. పిల్లల చదువులు భారమైనందు వల్ల మన అక్షరాస్యత తక్కువగా వుంది. ప్రైవేటు చదువు మరీ భారంగా వుంది. సమస్యకు మూల కారణం ఊళ్లో బడి దివాళా తీయడం. కనీస వసతులు, చదువులు లేక ప్రజల్నించి దూరం గావడం. నిరుపేదలు కూడా ప్రైవేటును ఆశ్రయించడం. మన పాఠశాలల్ని చూడముచ్చటగా మార్చి వుంటే అద్భుతాలు జరిగేవి. రెండు మూడేళ్లలో వీటి రూపురేఖలే మారి పొయ్యేవి. మంచి చదువు పేద పిల్లలకూ దక్కేది. ఆ ఊరి పిల్లలు ఆ ఊరి బడి లోనే చదివే స్థితి వుంటే మన విద్యారంగం ఎలా వుంటుందో ఒకసారి ఊహించుకొంటే ఇది తెలిసొస్తుంది. ప్రభుత్వ బడిని మార్చకుండా తల్లి దండ్రులకు నగదు ఇవ్వడం వల్ల మార్పు రాదని తేలిపోయింది. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తామని 'నాడు-నేడు' పథకం తెచ్చినా మార్పు కానరాలేదు.. నిపుణుల కమిటీలన్నీ ప్రాథమిక విద్య వరకైనా మాతృభాషా మీడియం వుండి తీరాలంటున్నాయి. నూతన విద్యా విధానం కూడా ఇదే చెబుతోంది. ప్రభుత్వం నియమించిన కమిటీ కూడా ఇదే పేర్కొంది. కేంబ్రిడ్జి, అజీం ప్రేంజీ ఫౌండేషన్లు చేసిన పరిశీలనల్లో ఇంగ్లీషు మాధ్యమం తీవ్ర నష్టం తెచ్చిందని తేలింది. ఆంగ్ల మాధ్యమాన్ని మొండిగా ఎవ్వరూ వ్యతిరేకించడం లేదు. మొదట మాతృభాషలో ప్రారంభించి ఒకానొక దశలో ఆంగ్లంలోకి మళ్లించాలని మాత్రమే చెబుతున్నారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో జరుగుతున్నదీ ఇదే! ఇంగ్లీషు మీడియం పెడితే మంచి చదువు చెప్పేసినట్లు అవుతుందనుకొంటుంది ప్రభుత్వం. ప్రస్తుత టీచర్లు దీనికెంత అర్హులన్న ప్రశ్న కూడా వుంది. పిల్లల చదువుల్ని మూల్యాంకనం చేసి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, మారుతున్న అవసరాలకు తగ్గ పాఠ్యాంశాలు రూపొందించి, శిక్షణలిచ్చి ఎప్పటికప్పుడు సృజనాత్మకంగా బోధనాభ్యసనాలు సాగేలా చూసే బాధ్యత ఎస్.సి.ఆర్.టి వారిది. జిల్లా విద్యా శిక్షణా సంస్థలది. ఉమ్మడి సర్వీసు నిబంధనల సాకుతో అన్ని పోస్టులు




ఖాళీగా వున్నాయి. ఒక స్పష్టమైన దృక్పథం వుంటే మొదట దీనిపైన దృష్టి సారించాల్సి వుంటుంది. అన్ని స్థాయిల్లో బలమైన వ్యవస్థల్ని నిర్మించాల్సి వుంటుంది. వ్యవస్థలోని మరో బలహీనత ప్రజల్ని ఏ మాత్రం భాగస్వాముల్ని చెయ్యలేకపోవడం. బడిని ఒంటరిగా మార్చడం. పంచాయతీలకు, స్థానిక దాతలకు స్థానం లేకుండా పోవడం. నాడు-నేడు నిధుల్ని పాఠశాల విద్యా కమిటీలే వ్యయం చేసేలా ఉత్తర్వులిచ్చారు. ఉన్నత పాఠశాలల్ని గుర్తించి, అన్ని హంగులు కల్పించాలి. బలమైన అకడమిక్ వ్యవస్థను రూపొందించాలి. అధ్యాపకుల్ని నియమించి ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల ప్రారంభించి దీనికి పూనుకోవాలి. ప్రస్తుత జూనియర్ కళాశాలల్ని, అందులోని రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకుల్ని ఎలా సర్దుబాటు చెయ్యాలో కూడా చర్చించాలి. మన ప్రాథమిక పాఠశాలలు కనీస వసతుల్లేని, ఒకటి రెండు గదుల్లో నడుస్తున్నాయి. వాటిలోకి పసి బిడ్డల్ని తేవడం వారికి రక్షణ కల్పించడం అంత సులవైనపనిగాదు.

# ప్రజలకు పుస్తకాలను చేరువ చేయాలి

**అన్నింటికీ గూగులు చూడడం సరికాదు**
**పాఠశాలల్లో గ్రంధాలయాను విస్తరించాలి**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్) :**

పుస్తకం హస్తభూషణం అన్నారు. ఇంటర్‌నెట్,స్మార్ట్ ఫోర్ మాయలో పడి మనం అంతా పుస్తక పఠనాన్ని మర్చి పోయాం. ప్రతిదీ గూగుల్ చూసిపెడుతుందన్న భావనలో ఉన్నాం. కానీ పుస్తక పఠనంతోనే మస్తిష్కం వికసిస్తుంది. మనం మరచిపోతున్న ఈ అలవాటును జ్ఞప్తికి చేసుకునేలా పుస్తక ప్రదర్శనలు ఉపయోగపడుతున్నాయు. అక్కడక్కడా ఏర్పాటు చేస్తున్న బుక్‌ఫెయిర్‌లు మళ్లీ ఆనదదాన్ని నింపుతున్నాయి. ఆసక్తిని పంచుతున్నాయి. డిజిటల్ యుగంలోనూ పుస్తకాలకు ప్రాముఖ్యత ఇంకా కొనసాగుతుంది. అక్షరాభ్యాసంతో ఆరంభమయ్యే ఈ అభిరుచి నిరంతరం నిరాఘాటంగా కొనసాగించాలి.పుస్తకాలు ప్రియమైన నేస్తాలు. డిజిటల్ యుగం లోనూ పుస్తకాలకు ఉన్న ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంటుంది. పుస్తకం ఒక విజ్ఞాన భాండాగారం. ఎప్పటికప్పుడు మన అవగాహనను పెంచుకోవడానికి అది అందించే విజ్ఞానం ఉపకరిస్తుంది. విజ్ఞానాన్ని పెంచుకోవడంతో బాటు, మనలో మనల్ని తెలుసుకునేలా చేస్తుంది. పుస్తకం మనచుట్టూ ప్రపంచాన్ని మనం తెలుసుకునేలా చేసే అపురూప సాధనంగా చూడాలి. అంతర్లీనంగా పుస్తకం అందించే విజ్ఞానం మన సామాజిక జీవనాన్ని నిర్దేశిస్తుంది. ఎన్నిపుస్తకాలు చదివితే అంతగా విజ్ఞానం అబ్బుతుంది. అందువల్ల పుస్తక ప్రియులు ఎలాగూ పఠనం చేస్తారు. ఆ అలవాటు లేనివారు సైతం అలవాటుచేసుకుంటే తమజ్ఞానాన్ని పెంచుకోగలుగుతారు. అందువల్ల పాటశాలస్థాయిలోనే రకరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. పుస్తకాల పఠనంపై ఆసక్తి తగ్గడంతో ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. అంతెందుకు స్కూళ్లలో కూడా గ్రంథాలయాలు అతంతంతగానే ఉంటున్నారు. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర గ్రంథాలు అందుబాటులో ఉండడం లేదు. రెఫరెన్స్ పుస్తకాలు కూడా దొరకడం లేదు. డబ్బుండి కొనుక్కునే వారికి తప్ప పుస్తకాలు లేక లైబ్రరీలు నిరసించి పోతున్నాయి. అంతకుమించి నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతోంది. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు తగ్గడం, సామాజిక శాస్త్రాలు చదివిన వారికి తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఆ శాస్త్రాలపై నేటి యువత మొగ్గుచూపటం లేదు. తద్వారా సమాజంతో బంధానికి దూరమౌతున్నారు. పాఠశాలల్లో ఒకప్పుడు లైబ్రేరియన్లు వుండేవారు. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా విద్యాలయాల్లో విద్యార్థులకు పాఠశాలల్లో లభిస్తున్న పుస్తకాలపై అవగాహన కలగడం లేదు. ఇటువంటి పరిస్థితులలో సాహితీవేత్తలు, భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు గ్రంథాలయ ఉద్యమాలు వంటివి మరోసారి ప్రారంభించాల్సిన అవసరం వుంది.ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా మారింది. పాలకుల నుండి కూడా పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. కేవలం పోటీ పరీక్షల కోసం ముద్రించే పుస్తకాలకు మాత్రమే డిమాండ్ ఉంటోంది. యువతలో ఎక్కువ మంది సినీ సాహిత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 'యునెస్కో' అంచనా ప్రకారం ప్రతి ఐదు వేల మందికి ఒక గ్రంథాలయం ఉండాలి. మన దేశంలో కేవలం 75 వేల గ్రంథాలయాలున్నాయనేది ఒక అనధికార అంచనా.



గ్రంథాలయాల్లో పోస్టుల భర్తీ కూడా సక్రమంగా జరగడం లేదు. చాలా గ్రంథాలయాలను ఆధునీకరించడం లేదు. లైబ్రరీలలో పాత పుస్తకాలే దర్శన మిస్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాలని కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. ఆ రోజుల్లోనే అయ్యంకి రమణయ్య గ్రంథాలయాల అభివృద్ధికి పది ఎకరాల స్థలాన్ని దానం చేసి 'గ్రంథాలయ ఉద్యమ పిత' గా పేరు పొందారు. తెలుగు రాష్ట్రాల్లో పుస్తక మహోత్సవాలను హైద్రాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, కర్నూలు వంటి ప్రముఖ పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మార్కెట్లో వచ్చే కొత్త పుస్తకాలపై అవగాహన ఏర్పడటం లేదు. పిల్లలకు కనీసం చదవడం, రాయడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటువంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూడా చిన్న, చిన్న పుస్తక మహోత్సవాలను నిర్వహించి స్థానిక రచయితలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సాహిత్యాన్ని పరిపుష్టం చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో కూడా గ్రంథాలయాలను ఆధునీకరించాలి.

# అనేక దేశాల్లోనూ మాతృభాషా బోధన

**పరభాషలను నేర్పించడంలో తప్పు లేదు**
**ఇంగ్లీష్, హిందీలను అలవాటు చేయాల్సిందే**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

ప్రపంచంలోనే అనేక దేశాలు, అందులో అతి చిన్న దేశాలు మొదలు అతి పెద్ద జనాభాగల చైనా వరకు అన్ని దేశాలూ వారి మాతృభాషలోనే ప్రాథమిక విద్య బోధిస్తున్నాయి. కొన్ని దేశాలు పి.జి వరకు మాతృభాషనే వాడుకుంటున్నాయి. జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు మాతృభాష మాధ్యమంలోనే నడుస్తున్నాయి. చిన్న దేశమైన క్యూబా మాతృభాషలోనే వైద్యంలో అద్భుతాలు సాధించింది. ప్రాంతీయ భాషలు కూడా అర్థం కాని అనేక గిరిజన తెగలు మన దేశంలో ఉన్నాయి. ఉదాహరణకు తెలంగాలో ఆదిలాబాద్ తదితర గిరిజన ప్రాంతాల్లో ఉండే గోండులు తమ తెలుగును కూడా అర్థంచేసుకోవడం కష్టం. వారికి ఇక ఇంగ్లీష్ అర్థంకావడం కష్టమే. తెలుగు భాషలో అనువాదం చేస్తే తప్ప గిరిజన పిల్లలు స్కూలుకు రాని పరిస్థితి వుంది. ఇక ఇంగ్లీషు రుద్దితే బడి మానేస్తారు తప్ప అద్భుతంగా రాణించలేరు. ఇంట్లో తెలుగు, ఊరిలో తెలుగు, సమాజమంతా తెలుగు వినిపిస్తోంది. పుట్టిన దగ్గర నుండి తెలుగు వింటూ, మాట్లాడు తుంటారు. కనుక తెలుగులో క్లిష్టమైన విషయాన్ని కూడా అర్థం చేసుకోడానికి అవకాశం వుంది. ఒకవేళ తెలియకపోతే ఎవరిని అడిగినా చెప్పగలరు. అదే తెలియని ఇంగ్లీషు భాషలో అర్థం చేసుకోవడం కష్టం. ఇంగ్లీషు తెలియని ఇళ్ళు, సమాజం నుండి వివరణ అడిగి తెలుసుకునే అవకాశం తక్కువ. అందువలన ప్రాథమిక విద్యా స్థాయిలో... ఆంగ్ల మాధ్యమంలో విషయ పరిజ్ఞానం, జ్ఞాన సంపాదన కష్టం. పైగా పేదలు తమ పిల్లలకు డబ్బు పెట్టి ట్యూషన్‌కు పంపించలేరు. టీచర్లను పెట్టి చదివించుకోలేరు. అన్ని విధాలా పేదల పిల్లలు ఇంగ్లీషు మాధ్యమంలో నష్టపోవడం ఖాయం. డబున్న వాళ్లకు అన్ని అవకాశాలు వుంటాయి గనుక ఏ మాధ్యమమైనా ఫర్వాలేదు. అయినా వారిలో కూడా విషయపరిజ్ఞానం అంతగా ఉండదనే గుర్తించాలి. భారతీయుడి ఆలోచన బ్రిటీష్ వాడిదిగా ఉండాలనే లక్ష్యంతో మెకాలే విద్యా విధానం ప్రవేశ పెట్టారు. మనగురుకుల విద్యను దెబ్బతీయాలన్న సంకల్పంతో ఆ పనిచేశాడు. దీంతో మనం నష్టపోయి..వాడు లాభపడ్డాడు. తన ఆలోచనలతో ప్రభావితం చేసి భారతీయులను శాశ్వతంగా బానిస మనస్తత్వంతో బతికేలా కుట్ర చేశారు. ప్రజలంతా ఒక్కటై తనపై తిరగబడకుండా 3 లేక 4 భాషల ప్రజలను ఒక ప్రావిన్స్‌లో ఇరికించారు. ఈ కుట్రను భగం చేసి అందరినీ ఒక్కటి చేసేందుకే మాతృభాషా ఉద్యమాలకు జాతీయో ద్యమం పిలుపునిచ్చింది. అందువల్ల ముందుగా ప్రతి ఒక్కరికి చదువు అన్నది నినాదం కావాలి.అది దేశంలో జాతీయోద్యమంగా సాగాలి. ఇకపోతే ప్రతి పాఠశాలలో సమగ్ర గ్రంధాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలి.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# (ఫ్రైడే డ్రై డే ) కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్యా అడిషనల్ అధికారి

**మహాత్మ జ్యోతిరావు పూలే, కస్తూర్బా గాంధీ హాస్టల్స్ లో సందర్శన,డాక్టర్ సాయినాథ్ రెడ్డి వంటశాలు, పాత్రలు పరిశుభ్రంగా ఉండాలి స్వచ్ఛమైన నీరు ఇవ్వాలి**



**పెబ్బేరు, సెప్టెంబర్ 06 (పీపుల్స్ మోటివేషన్): -**

పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారంరోజు (ఫ్రైడే డ్రై డే) సందర్భంగా వనపర్తి జిల్లాలోనీ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, మహాత్మ జ్యోతిరావు పూలే, కస్తూర్బా గాంధీ స్కూల్ కు , జిల్లాఅడిషనల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, సందర్శించి, స్కూల్ గదులను, వంటశాలను పరిశీలించి, విద్యార్థినులకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం గురించి వివరించి, సిమెంట్ ట్యాంకుల్లో, పూల కుండీలలో, కూలర్లలో, చిన్న చిన్న పాత్రలో నీళ్లు నిలువ ఉంటే అందులో దోమలు గుడ్లు పెడతావి, ఆంటీ గుడ్లు లార్వాగా పెరిగి దోమలుగా తయారవుతాయి అందుకోసం ప్రతి శుక్రవారం రోజు నీళ్లు నిలవకుండా పారబోయాలి, అలాగే విద్యార్థినుల వాష్ రూమ్ పోయిన తర్వాత, భోజనము ముందు తప్పనిసరిగా హ్యాండ్ వాష్ సూత్రాలు పాటించాలనీ చెప్పారు. ప్రతి గురువారం రక్తహీనత కు సంబంధించిన ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లు వేసుకోవాలనీ జిల్లా వ్యాధి నిరోధకశాధికారి డాక్టర్ పరిమళ, తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ చైర్-పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయినాథ్, మున్సిపల్ కమిషనర్ అది శేషు, వైద్యాధికారులు హరినాథ్ రెడ్డి, చంద్ర శేఖర్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేవరకద్ర ఎమ్మెల్యేను పరామర్శించిన వనపర్తి జిల్లా అధ్యక్షుడు

**ఎం.రాజేంద్రప్రసాద్ యాదవ్**





**శ్రీరంగాపూర్/వనపర్తి, సెప్టెంబర్ 06 (పీపుల్స్ మోటివేషన్):-**

దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి తండ్రి నిన్న మరణించడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీరంగాపూర్ ఎక్స్ జెడ్పిటిసి ఎం. రాజేంద్రప్రసాద్ యాదవ్ జి మధుసూదన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములు యాదవ్, పెబ్బేరు టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట్ రాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాంపురం సహదేవుడు, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# పిసిసి అధ్యక్షునిగా మహేష్ గౌడ్ ఎన్నిక



**శ్రీరంగాపూర్/వనపర్తి, సెప్టెంబర్ 06 (పీపుల్స్ మోటివేషన్):-**

తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా మహేష్ కుమార్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిచెర్ల శ్రీహరి రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ యందు బీసీలకు సమోచిత న్యాయం ఇస్తారన్నది ఇందుకు నిదర్శనమని ఆయన సూచించారు. మల్లికార్జున ఖర్గే పిసిసి అధ్యక్షుల పదవి ఒక బీసీ నాయకునికి ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయం అని ఆనందం వ్యక్తం చేశారు. ఆయనకు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు.

# విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

**వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపు**

**దేవనకొండ, సెప్టెంబర్ 06 (పీపుల్స్ మోటివేషన్):-**






రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు కారణంగా విజయవాడ నగరంలో సంభవించిన వరద విపత్తుల కారణంగా నష్టపోయిన ప్రజలకు ఆర్థిక చేయూత కోసం మండల కేంద్రమైన దేవనకొండ నందు విరాళాలు సేకరించి సీఎం సహాయ నిధికి పంపనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి ఎమ్.నరసరావు, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.మధు, కె. భాస్కర్ లు తెలిపారు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ - ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దేవనకొండ నందు విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇటీవల సంభవించిన వరదల కారణంగా విజయవాడ గుంటూరు,పల్నాడు,ఏలూరు జిల్లాలో పెద్ద ఎత్తున వరదలు వచ్చి లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర ప్రజలు ధాన్యం వస్తువులు సర్వస్వం కోల్పోయారని తెలిపారు. వేలకోట్ల లో ఆస్తి,పంట నష్టం జరిగిందన్నారు.ఇలాంటి విపత్తు సమయంలో వరద బాధితుల ను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి,వారి సహాయార్థం విరాళాలు,వస్తురూపేనా, బట్టలు, తదితరాలు వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వ సహాయ నిధి కి పంపనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శిలు వి. రాజశేఖర్, కృష్ణ ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రామాంజనేయులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు రాజశేఖర్, కృష్ణ, శేఖర్, సురేంద్ర, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ని విమర్శించడం తగునా!!

**పత్రికా సమావేశంలో పల్లేటి బాపన్న దొర విమర్శ**
**వైసిపి నాయకుల మాటలు అర్థాలు వేరులే !!!**



**యు కొత్తపల్లి/పిఠాపురం, సెప్టెంబర్ 6 (పీపుల్స్ మోటివేషన్):-**

ఈ మధ్యకాలం విజయవాడలో బుడమేరు గట్టు తెగిపోయి గ్రామాల్లోకి వరద నీరు వచ్చి ముంపు జరిగిన విషయం మీ అందరికీ తెలిసినదే!! ఇదే విషయం పై ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ వరద పై ఏమి స్పందించలేదని వైసిపి నాయకులు పదేపదిగా మాట్లాడడం హాస్పదంగా గా ఉందని జనసేన పార్టీ సీనియర్ నాయకులు పల్లెటి బాపన్న దొర విమర్శించారు. శుక్రవారం ఉదయం కోన పాపపేట ఆయన నివాసంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ నాయకులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని వైసిపి నాయకులు విమర్శించడం పద్ధతి కాదని ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తే ఒక ఉప ముఖ్యమంత్రిగా కాక ప్రజలు సినిమా హీరోని చూడ్డానికి నాపై అభిమానంతో వచ్చి అక్కడ జరిగే పనులకు ఆటంకం కలుగుతుందని నేను ముంపు ప్రాంతాల్లో పర్యటించలేదని పవన్ కళ్యాణ్ పత్రిక ముఖంగా తెలియజేశారని పల్లేటి తెలిపారు. మా అధినాయకులు ఎప్పటికప్పుడు అక్కడ జరుగుతున్న పనులను అధికారులతో చర్చించి వారికి అవసరమైన నిత్యవసర వస్తువులను అధికారులతో మాట్లాడి పంపించేవారిని అంతేకాకుండా తమ నాయకుడు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలంగాణ రాష్ట్రానికి 6 కోట్లు రూపాయలు విరాళంగా ఇచ్చారని నాలుగు కోట్లు 400 గ్రామపంచాయతీలకు ఒక కోటి మన రాష్ట్రానికి ఇంకొక కోటి రూపాయలు తెలంగాణ ప్రభుత్వానికి కేటాయించిన మంచి మనసున్న వ్యక్తిని అంతేకాకుండా వారి కుటుంబ సభ్యులు కూడా ఈ వరద ప్రాంతంలో ముంపుకు గురైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధికి నగదు అందించారని అటువంటి వ్యక్తిని వైసిపి నాయకులు విమర్శించడం ఎంతవరకు న్యాయమని పత్రిక ముఖంగా ఆయన ఖండించారు. అదేవిధంగా మత్స్యకారులకు పవన్ కళ్యాణ్ అండగా ఉంటారని గతంలోనే ఆయనను మా జనసేన నాయకులు కలిసినప్పుడు చెప్పారని. ఇక్కడ ఉన్న అరబిందో కెమికల్ ఫ్యాక్టరీ పైప్లైన్లు సముద్రంలో కలపడం మత్స్య సంపదకు నష్టం వచ్చే అవకాశం ఉందని ఎన్నికల ముందు వాటిని తొలగించాలని ధర్నా చేశామని అధికారులు ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా ధర్నా విరమించాలని వారు సూచన మేరకు ధర్నా నిలుపుదల చేశామని ఇదే విషయాన్ని త్వరలో మా అధినాయకులు పవన్ కళ్యాణ్ తో మాట్లాడి ఒక నిర్ణయం తీసుకుంటామని బాపనధర తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలపల్లి నూకరాజు, కారే బాబ్జి ,దొంక సత్తిబాబు ,కారే మహేష్ పల్లేటి దేవుడు, ఉమ్మిడి ప్రకాష్, కారే రాజు, పుక్కలా నాగేష్ కోడా బుజ్జి, పుక్కల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే మేఘా రెడ్డి చొరవతో బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి 5 లక్షల ఆర్థిక సహాయం



**శ్రీరంగాపూర్/వనపర్తి, సెప్టెంబర్ 06 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ మండల పరిధిలోని తాటిపాముల గ్రామానికి చెందిన వడ్డె చంద్రయ్య 30వ తారీఖు నాడు తన సొంత మట్టి ఇంటిలో నిద్రిస్తుండగా. అకాల వర్షం కురవడంతో ఇంటి పైకప్పు కూలి మీద పడడంతో అక్కడికక్కడే మరణించడం జరిగింది. ఇట్టి విషయము మండల కాంగ్రెస్ నాయకులు చేత తెలుసుకున్నటువంటి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్లడ్ జీవో నుండి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఎంతో చొరవ తీసుకొని ప్రత్యేకంగా కలెక్టర్ తో మాట్లాడి. చంద్రయ్య కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున అందవలసినటువంటి ఐదు లక్షల రూపాయలను శుక్రవారం వడ్డె చంద్రయ్య కుమారుడు రాముడు అకౌంట్లో వెయ్యడం జరిగింది. వడ్డె చంద్రయ్య కుమారుడు రాముడు డబ్బులను త్వరగా వారం రోజులలోనే మాకు వచ్చేందుకు సహకరించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, కలెక్టర్ మరియు ఎమ్మార్వో కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అంకె వెంకటయ్య నాయుడు, తాటిపాముల కాంగ్రెస్ నాయకులు ఒడ్డే బొజ్జవెంకన్న, రాంచంద్రయ్య, రాముడు, చిన్న వెంకటయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# హసీనా రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారు

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ గురువారం మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను తిరిగి బంగ్లాదేశ్ (ప్రభుత్వం) అప్పగించాలని కోరుకునే వరకు భారత్‌లో సైలెంట్‌గా ఉండాలన్నారు. లేకపోతే భారత్-బంగ్లా బలమైన సంబంధాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. గురువారం ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన యూనస్, హసీనా భారత్‌లో మౌనంగా ఉండకుండా రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇలాంటివి బంగ్లాను ఇబ్బందులకు గురి చేస్తాయి. ప్రజల తిరుగుబాటు, ఆగ్రహంతో ఆమె పారిపోయింది. ఆమెను తిరిగి దేశానికి తీసుకురావాలి. చేసిన దురాగతాలను అందరి ముందు విచారించాల్సిందే అని యూనస్ అన్నారు. అలాగే, భారత్-బంగ్లా రెండు దేశాల సంబంధాలపై ఎలాంటి ప్రభావం పడకుండా సంబంధాన్ని మెరుగుపరచడానికి మేము కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. హసీనా ప్రభుత్వం పతనం తర్వాత దేశాల మధ్య మొదటి ఉన్నత స్థాయి సంప్రదింపులో యూనస్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోన్‌లో సంభాషించిన వారాల తర్వాత ఆయన నుంచి ఈ ప్రకటన వచ్చింది. ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాట్లతో ఆగష్టులో హసీనా ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేసి భారతదేశానికి వచ్చారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# బిజెపి పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన దేవనకొండ బిజెపి మండల కన్వీనర్ బోడ రవికుమార్





### ఏపీలో వరద ప్రాంతాన్ని పరిశీలించి సహాయక చర్యల కోసం 3300 కోట్లు నిధులు విడుదల చేసిన బిజెపి ప్రభుత్వం

**దేవనకొండ, సెప్టెంబర్ 6 (పీపుల్స్ మోటివేషన్):-**

వరదల వలన ఆంధ్ర ప్రదేశ్ కి జరిగిన నష్ట ప్రభావాన్ని పరిశీలించిన బీజేపీ పెద్దలు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్న బిజెపి మండల కన్వీనర్ బోడ రవికుమార్ ఆంధ్ర ప్రదేశ్‌లో వరద ప్రాంతాలని పరిశీలన లో భాగంగా కృష్ణానదికి వరద రావడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, పెద్దమనసుతో ఆర్థిక సహాయం 3,300 కోట్లు సాయం అందించింది కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఏరియల్ సర్వే ద్వారా బుడమేరు, క్యాచ్‌మెంట్ ఏరియా, వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రమంత్రి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని వివరాలు తెలుసుకొని మరియు జక్కంపూడి మిల్క్ ఫ్యాక్టరీ, కండ్రిక, అజిత్ సింగ్ నగర్, అంబాపురం, విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాలకు వరద కారణంగా జరిగిన నష్టాన్ని త్వరితగతిన భర్తీ చేసేందుకు ఆర్థిక సాయంగా 3300 కోట్లు నిధులు తక్షణ సహాయక చర్యల కోసం ఈ నిధులు ఉపయోగించుకోవాలని కేంద్ర మంత్రులు తెలియజేశారు. కావున కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని బీజేపీ పార్టీ తరపున ప్రత్యేక ధన్యావాదాలు తెలుపుతున్నామని దేవనకొండ బిజెపి మండల కన్వీనర్ బోడ రవికుమార్ తెలియజేశారు.

## ఉండ్రాళ్లయ్య... దండాలయ్యా అంటున్న పసిపిల్లలు





**ప్యాపిలి, సెప్టెంబర్ 06 (పీపుల్స్ మోటివేషన్):-**

ప్యాపిలి పట్టణం లోని అంగన్వాడీ ఒకటవ సెంటర్ లో శుక్రవారం రోజు మట్టి వినాయకుడు తెచ్చి చిన్నపిల్లలకు వినాయకుని గురించి బోదించిన అంగన్వాడీ కార్యకర్త సరస్వతిని పసిపిల్లల తల్లులు అభినందనలు తెలిపారు. పట్టణంలో వీధులలో విగ్రహాల వినాయక చవితి నిశిద్ధంగా ఉండటంలో ఇంటికే పరిమితం అయ్యింది. ప్రతి పిల్లలకు చిన్నప్పటినుండే ఏకాగ్రత, తల్లి మాట పట్ల గౌరవం, భక్తిశ్రద్ధలు ఎలా ఉండాలో వినాయకునిచూసి నేర్చుకోవాలని విలువలతో కూడిన విద్య, బుద్ధి, శ్రద్ధ తెలుసుకునేందుకే వినాయక చవితిని జరుపుకుంటామని, తల్లి తండ్రులు తమ పిల్లలకు నేర్పించాలని అన్నారు. టీచర్ సరస్వతి పిల్లలకు వినాయకుని అవతారం శ్లోకంగా మొదలు పెట్టి వినాయకుని జన్మ వృత్తాంతం తెలిపారు. ఉండ్రాళ్లయ్యా.. దండాలయ్య అంటూ పసివాళ్ళు సంబరాలు చేసుకున్నారు. సంప్రదాయ బద్ధంగా.. పూజలను మట్టి వినాయకునితో జరుపుకోవాలని పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను బోధించారు. నిర్విఘ్నం దేవా అని కొలుస్తూ పలకలు పుస్తకాలు పూజకు పెట్టి మంచి భవిష్యత్తును ప్రసాదించాలని కోరారు. కాషాయం వర్ణ శోభతో ఆనందోత్సవంగా సోబిల్లిన వాతావరణంతో పిల్లల ఆనందం చూడముచ్చటగా ఉందని సరస్వతి తెలిపారు. హిందూ ముస్లిం క్రిస్టియన్ అను మతముల తేడా లేకుండా పిల్లలకు ప్రతి ఒక్కరూ భగవద్గీత గురించి కూడా ఇష్ట బోధ చేస్తే జీవిత సత్యాలు, పరమార్ధం తెలుస్తాయని అభిప్రాయపడుతున్నారు.

## సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

**డాక్టర్ : వాణిశ్రీ**





**ప్యాపిలి, సెప్టెంబర్ 06 (పీపుల్స్ మోటివేషన్):-**

మండలంలోని పెద్దాపుదెళ్ల గ్రామంలో వైద్యాధికారి డాక్టర్.వాణిశ్రీ వైద్యసిబ్బంది ఎఫ్ డీ పి కార్యక్రమం ద్వారా 63 మందికి బీ పి, షుగర్ ఎచ్ బీ మొదలుగు పరీక్షలు నిర్వహించి, చికిత్స చేసి మందులు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఈ ఓ ఆర్ డీ బాలకృష్ణ మరియు సిబ్బంది తో కలసి గ్రామం లో ఫ్రైడే, డ్రై డే కార్యక్రమంను ఇంటింటికి తిరిగి నీటి తొట్టిలను, పరిసరాలను పరిశీలించి దోమలు నిలువ నీటిలో గుడ్లు పెట్టి లార్వా, పీపా పెద్ద దోమలుగా బయటికి వచ్చి మలేరియా, డెంగీ, చికెన్ గున్య, జ్వరలను కలిగిస్తాయి అని ప్రతి ఒక్కరు భాగ స్వామ్యాలు అయి ప్రతి వారం నీటి తొట్టి లను శుభ్రం చేసుకోవాలని,దోమల వృద్ధిచెందకుండ చేయాలనీ దోమ తెరలు కట్టుకోవాలని ఇంటిలో వేపాకు పొగ వేసుకోవాలి అని ప్రజలకు అవగాహనా కల్పించడం జరిగింది. కార్యక్రమం లో విజయకుమారి, రాఘవేంద్ర గౌడు, శ్రీజ, పంచాయతీ కార్యదర్శి శకుంతల, చింతలయ్య, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ వినాయక చవితి శుభాకాంక్షలు

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

వినాయక చవితి పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వాడ వాడల వెలిసే గణెశిష్ మండపాలలో భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించాలన్నారు. ఈ నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను అప్రమత్తం చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ ఏడాది వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుందని సీఎం ఇప్పటికే ప్రకటించారు.

## నేటి పూజలకు సిద్దమైన ఖైరతాబాద్ గణెశుడు సిద్దం

**70 అడుగులతో అపురూపంగా మలచిన చిత్రకారుడు**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

దేశవ్యాప్తంగా వినాయక చవితి సందడి నెలకొంది. వినాయక ప్రతిమలు కొనుగోలు చేసే బిజీలో భక్తులు ఉన్నారు. పూలు, పండ్లు కొనుగోలు చేసేందుకు మార్కెట్లకు మహిళలు పోటెత్తారు. వినాయక చవితి అంటే గుర్తొచ్చేది ఖైరతాబాద్ గణపతి. ఈ సారి 70 అడుగుల్లో వినాయకుడు దర్శనం ఇవ్వనున్నారు. ఉత్సవాలను ప్రారంభించి 70 ఏళ్లు అవుతున్నందున 70 అడుగుల పొడవుతో ప్రతిమను ఏర్పాటు చేశారు. సప్తముఖ మహాశక్తి రూపంలో లంబోదరుడు దర్శనం ఇస్తోన్నారు. ఖైరతాబాద్‌లో సప్తముఖ మహాశక్తి రూపంలో వినాయకుడు కొలువై ఉన్నాడు. గణపతి కుడివైపున శ్రీనివాస కల్యాణం, ఎడమవైపు శివపార్వతుల కల్యాణ ప్రతిమలను నెలకొల్పారు. అయోధ్యలో ప్రతిష్టించిన బాల రాముడు, రాహువు, కేతువును ప్రతిష్టించారు. గతంలో సప్తముఖ మహా గణపతిని రూపొందించారు. ఈ సారి రూపొదించిన ప్రతిమ అందుకు భిన్నంగా ఉంది. ప్రపంచశాంతితోపాటు ప్రజలకు ఆయురారోగ్యాలు కలిగేలా గణపతిని సప్తముఖాలతో పూజించాలని దివ్యజాన సిద్ధాంతి గౌరీభట్ల విఠల శర్మ సూచించారు. ఆ ప్రకారం కమిటీ, ప్రధాన శిల్పి రాజేంద్రన్ వినాయకుడి ప్రతిమను తయారు చేశారు. వినాయకుడికి 7 తలలు, 14 చేతులు, తలలపై నాగ సర్పాలతో కలిసి 70 అడుగుల ఎత్తులో వినాయకుడి ప్రతిమ నెలకొల్పారు. ఖైరతాబాద్ గణెశిశుడికి పద్మశాలి సంఘం 75 అడుగుల జంజం, 50 అడుగుల కండువాను సమర్పిస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు ఖైరతాబాద్ గణపతి తొలి పూజ నిర్వహిస్తారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులు తొలి పూజలో పాల్గొంటారు. గతంలో గవర్నర్లు తొలి పూజలో పాల్గొనేవారు. మధ్యాహ్నం 3 గంటలకు ఖైరతాబాద్ గణపతిని గవర్నర్ దర్శించుకుంటారు. ఖైరతాబాద్ వినాయకుడి ప్రతిమ అత్యంత శోభాయమానంగా ఉంది. చూడటానికి రెండు కళ్లు సరిపోవడం లేదు. లంబోదరుడి ప్రతిమను చూసేందుకు భక్తులు భారీగా వచ్చే అవకాశం ఉంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పోలీసులు, అధికారులు చేశారు.

## రాష్ట్రపతి పరిశీలనకు అపరాజిత బిల్లు

**పంపించిన గవర్నర్ ఆనందబోస్**

**కోల్‌కతా,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్) :**

అత్యాచారం, హత్య కేసుల్లో నిందితులకు మరణ శిక్ష విధించేలా పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఆమోదించిన అపరాజిత బిల్లును ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరిశీలనకు శుక్రవారంనాడు పంపారు. ఈ మేరకు రాజ్‌భవన్ మీడియా సెల్ ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గతవారంలో 'అపరాజిత మహిళ, శిశు (పశ్చిమబెంగాల్ క్రిమినల్ చట్టాల సవరణ) పేరుతో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లును బెంగాల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం దీనిని గవర్నర్‌కు ప్రభుత్వం పంపింది. ఈ నేపథ్యంలో బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో ట్రెయినీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడం, వైద్యుల నుంచి నిరసనలు వెల్లువెత్తడంతో ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించారు. ఈ క్రమంలోనే అత్యాచార, హత్య నిందితులకు మరణశిక్ష విధించేలా అసెంబ్లీలో పది రోజుల్లోగా తీర్మానం చేస్తామని ప్రకటించిన మమతా బెనర్జీ ఆ గడువులోగానే సభలో బిల్లు ప్రవేశపెట్టారు. బిల్లుపై చర్చ అనంతరం అసెంబ్లీ ఏకగ్రీవంగా దీనిని ఆమోదించింది. బిల్లును పెండింగ్‌లో పెట్టకుండా గవర్నర్ సైతం హుందాగా దీనిని ఆమోదించాలని మమతా బెనర్జీ ఈ సందర్భంగా కోరారు.

## విజయవాడ వరద బాధితులకు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



**నందికొట్కూరు, సెప్టెంబర్ 6 (పీపుల్స్ మోటివేషన్):-**

ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం పిక్కిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సాయంత్రం నాలుగు గంటలకు విజయవాడ వరద బాధితులకు పట్టణంలో వాల్మీకి నగర్ నుండి శాంతి టాకీస్ పాత బస్టాండ్ కొత్త బస్టాండ్ పోలీస్ స్టేషన్వరకు విరాళాల సేకరణ చేయడం జరిగిందన్నారు అనంతరం ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.గత వారం రోజులుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో . కురుస్తున్న భారీ వర్షాలకు విజయవాడ నగరం పూర్తిగా జలమయం అయిందని బుడమేరు వరద ఇల్లునీటిలో మునిగిపోయి సర్వం కోల్పోయారని ప్రాణ నష్టం తో పాటు ఇల్లు షాపులు పూర్తిగా నీటిలో మునిగి బురదమయం అయిందన్నారు కనీసం ఒంటిమీద బట్టలుతో సహా సర్వం కోల్పోయారని. 33 మంది చనిపోయారని 300 పశువులు చనిపోయాయని. దాదాపు 50 వేల మంది శిబిరంలో బాధితులుగా ఉన్నారని ఆహారం అందక నీరు దొరకక ఉండడానికి వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని(5) ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ తమవంతు సహాయంగా ఆర్థికంగా ఆదుకోవడానికి ముందుకు రావాలని బియ్యము బట్టలు ఇతర వస్తువులను వరద బాధితులకు సహాయంగా అందించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో రైతు మహిళ నాయకురాలు. ఎస్ బీబీ. ఎం మల్లేశ్వరమ్మ. నూర్జహాన్ మల్లమ్మ. నాయకులు కాటేపోగు సోమన్న. రాజు ఈ భాస్కర్ గౌడ్ వడ్డే రాజు మా భాష మహేష్ గౌడ్ శ్రీనివాసులు మను నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గణపవరంలో భారీ వర్షం

**భీమవరం,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

గణపవరంలో శుక్రవారం సాయంత్రం వర్షం దంచి కొట్టడంతో రహదారుల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి వాయగుండం ప్రభావం వలన ప్రతిరోజు కురిసే వర్షం వలన ప్రజలు, రైతులు, తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉండటంతో వర్షం ఇబ్బందులు ఉండవని ప్రజలు భావించినప్పటికీ సాయంత్రం వర్షం దంచికొట్టడంతో రొయ్య రైతులు, వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. కురిసిన వర్షాల వల్ల రొయ్యలకు ఆక్సిజన్ అందక వైరస్ సోకి చనిపోతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. వరిసాగు ప్రస్తుతం పొట్టదశలో ఉందని ఈ సమయంలో వర్షం వలన వరికి ఇబ్బందులు వస్తాయని వరి సాగు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శనివారం । సెప్టెంబర్ । 7 । 2024


# వరద ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు రావాలి





**బుడమేరు గండ్లను పూడ్చడం ప్రధాన లక్ష్యం**
**ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన చంద్రబాబు**

**విజయవాడ,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

బుడమేరు గండ్లు పూడ్చడం..సాధారణ పరిస్థితులు తీసుకుని రావడం. అన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలపై శుక్రవారం విజయవాడ కలెక్టరేట్ వద్ద సీఎం మీడియాతో మాట్లాడారు. వరద ప్రాంతాల్లో బాధితుల కోసం ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఏరియల్ సర్వే ద్వారా ముంపు ప్రాంతాలన్నీ పరిశీలించా. ప్రస్తుతంపై నుంచి ప్రవాహం రావడం లేదు. ముంపు ప్రాంతాల్లో క్రమంగా నీరు తగ్గుతోంది. ముందు బుడమేరు గండ్లు పూడ్చాలి.. అదే మా లక్ష్యం. బుడమేరు మూడో గండిని పూడ్చేందుకు సైన్యం కూడా వచ్చారు. మూడో గండిని ఇవాళ రాత్రికి పూడ్చాలని సర్వశక్తులు ఒడ్డుతున్నాం. సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాం. 149 అర్బన్, 30 రూరల్ సచివాలయాల నుంచి పనులు చేపట్టాం. 3.12 లక్షల ఆహార పొట్లాలు, 11.5 లక్షల వాటర్ బాటిళ్లు, పాలు, బిస్కెట్లు, కొవ్వొత్తులు పంపిణీ చేశాం. నీరు నిల్వ ఉన్న చోట తప్ప మిగతా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాం. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. వరద ప్రాంతాల్లో 72శాతం పారిశుద్ధ్య పనులు పూర్తి చేశాం. 7,100 మంది పారిశుద్ధ్య సిబ్బంది పనిచేస్తున్నారు. 1,300 పీడీఎస్ వాహనాలు తిరుగుతున్నాయి. ప్రతి కుటుంబానికి నిత్యావసరాల కిట్ ఇస్తున్నాం. మూడ్రోజుల్లో అందరికీ అందుతాయని సీఎం చంద్రబాబు వివరించారు. విజయవాడలోన వరద ముంపు ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే చేశారు. వరదలకు మూల కారణమైన బుడమేరు డ్రైన్, కొల్లేరు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. వరద ప్రవాహం, ముంపు, గండ్లు పడిన ప్రాంతాలను సర్వే చేశారు. ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణా నదీ ప్రవాహాన్ని పరిశీలించారు. అంతకుముందు నగరంలో కొనసాగుతోన్న వరద సహాయక చర్యలపై మంత్రులు, అధికారులతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో వరద తగ్గగా పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. వీటిపై పూర్తి వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. ÷రిరజన్లతో రోడ్లు, కాలనీలు, ఇళ్లు, షాపుల్లో బురదను తొలగించాలని.. చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. వరదలకు ఇళ్లల్లో చెడిపోయిన ఎలక్ట్రిక్ వస్తువులను రిపేర్ చేయించేందుకు నిపుణులను పిలిపించాలని సూచించారు. అటు, బుడమేరుకు పడిన గండ్ల పూడ్చివేత పనులను అధికారులు సీఎంకు తెలిపారు. మరోవైపు, బుడమేరు గండ్ల పూడ్చివేతలో భారత ఆర్మీకి చెందిన టాస్క్ ఫోర్స్ విభాగం పనిచేస్తోంది. ఇప్పటికే పనులు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన రెండు గండ్లను పూడ్చివేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం కొండపల్లి కవులూరు వద్ద గండిని పూడ్చివేత పనులను ఆర్మీ ఇంజినీరింగ్ టాస్క్ ఫోర్స్ వింగ్, రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రత్యేక పరికరాలతో రంగంలోకి దిగగా.. శుక్రవారం సాయంత్రం వరకూ గండిని పూడ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. గండ్ల పూడ్చివేతతో విజయవాడకు వరద ప్రవాహం తగ్గనుంది.అటు, వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు నిత్యావసర కిట్లను ప్రభుత్వం అందిస్తోంది. దాదాపు 2 లక్షల కుటుంబాలకు వీటిని అందించేలా చర్యలు చేపట్టింది. మొదటి రోజు 50 వేల కుటుంబాలకు కిట్లు అందించారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పంచదార, 2 కిలోల ఉల్లి, 2 కిలోల బంగాళదుంపలు, లీటర్ నూనె అందజేస్తున్నారు. ఈ పోస్ మిషన్ ద్వారా వీటిని పంపిణీ చేస్తున్నారు. రేషన్ కార్డు లేని వారికి.. ఆధార్, బయోమెట్రిక్ ద్వారా కిట్ ఇస్తున్నారు. విజయవాడ నగరం ఇప్పుడిప్పుడే వరద నుంచి కోలుకుంటోంది. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఇంకా వరద తగ్గలేదు. అజిత్ సింగ్ నగర్‌లోని పలు ప్రాంతాల్లోకి గురువారం కంటే శుక్రవారం మరో అడుగు నీరు చేరింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రామకృష్ణాపురం, రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో వరద ప్రవాహం కొనసాగుతుండగా స్థానికులు బంధువులు ఇళ్లకు వెళ్తున్నారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. వరద తగ్గిన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు వేగవంతం చేశారు. వైద్య శాఖ బాధితులకు మందులు పంపిణీ చేస్తోంది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వరద బాధితులకు తక్కువ ధరకే కూరగాయలు అందిస్తున్నారు.



# తెలంగాణ ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి

**జిట్టా మరణవార్తతో సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**
**నివాళి అర్పించిన హరీష్ రావు..జగదీశ్ రెడ్డి, కోమటిరెడ్డి**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణలో మలి దశ ఉద్యమంలోనే కాకుండా నాటి టీఆర్ఎస్ పార్టీ విస్తరణలో కీలక పాత్ర పోషించిన జిట్టా బాలకృష్ణ శుక్రవారం ఉదయం కన్నుమూశారు 52 ఏళ్ల బాలకృష్ణ... కొంత కాలంగా బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. కొన్ని రోజుల క్రితమే జిట్టా బాలకృష్ణ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రిలోనే చికిత్స పొందుతూ ఉదయం కన్నుమూశారు.బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న జిట్టా బాలకృష్ణారెడ్డి.. గత కొంతకాలంగా సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు భువనగిరికి తరలించారు. భువనగిరిలోని మగ్గంపల్లి రోడ్డులో ఆయనకి ఉన్న ఫామ్‌హౌస్‌లో అంత్యక్రియలు జరిగాయి. జిట్టా బాలకృష్ణ 1972లో నాటి నల్గొండ జిల్లా బొమ్మాయిపల్లి గ్రామంలో జన్మించారు. బీబీనగర్‌లో విద్యాభ్యాసం చేశారు. భువనగిరిలో కాలేజీ విద్యను పూర్తి చేశారు. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షతో ఉన్న జిట్టా బాలకృష్ణ...ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. టీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్‌తో కలిసి చాలా పోరాటాలు చేశారు ప్రత్యేక తెలంగాణ అవసరాన్ని ప్రజలకు ముఖ్యంగా యువతు చెప్పడంలో విజయవంతమయ్యారు. తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మంచి మిత్రుడిని, సన్నిహితుడిని కోల్పోయానని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. యువతను ఐక్యం చేసి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు జిట్టా అని సీఎం అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. జిట్టా బాలకృష్ణారెడ్డి(తన ప్రాంత ప్రజల కోసం ఎంతో తపనపడ్డారని మాజీ మంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. జిట్టా బాలకృష్ణారెడ్డి మరణం పట్ల సంతాపం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన అనేక పోరాటాల్లో కలిసి పనిచేశామని గుర్తు చేసుకున్నారు. బాలకృష్ణారెడ్డి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మరణం తీరని లోటన్నారు. వారికుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిట్టా బాలకృష్ణారెడ్డి భౌతికకాయానికి మాజీ మంత్రి హరీశ్ రావు నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాలకృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. హరీశ్ రావు వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఉన్నారు. ఇదిలావుంటే జిట్టా బాలకృష్ణా రెడ్డి అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బీఆర్ఎస్ నేతలు, జిట్టా అభిమానులు అడ్డగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పి అక్కడి నుంచి బయటపడ్డారు.

# తెలంగాణకు మరో రెండ్రోజులు వర్షసూచన

**పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం**
**శాంతించిన గోదావరి..ఉరకలేస్తున్న కృష్ణమ్మ**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

గత వారం రోజుల నుంచి తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలు, వరదలకు రాష్ట్రంలోని ప్రాజెక్టులు నిండు కుండలా మారాయి. మరో రెండు పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ నెల 7, 8వ తేదీల్లో యతేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇక గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఇదిలావుంటే ఎగువ నుంచి వరద తగ్గడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 42.2 అడుగుల వద్ద వరద ప్రవహిస్తుండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. శుక్రవారం రాత్రికి మరింతగా వరద తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే తాలిపేరుకు ఎగువ నుంచి వరద వస్తుండడంతో అధికారులు 24 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. 17,704 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 74 మీటర్లు కాగా.. ప్రస్తుతం 69.90 మీటర్ల మేర నీరు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. మరోవైపు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నదికి మళ్లీ వరద పోటెత్తింది. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ వైపు కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీశైలం స్పిల్ వే ద్వారా 1.67 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 1.64 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 884.4 అడుగులుగా ఉంది. శ్రీశైలం గరిష్ఠ నీటినిల్వ 215.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 212.9 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ముమ్మరంగా కొనసాగుతోంది. విద్యుత్ ఉత్పత్తి చేసి 67,631 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సాగర్ పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

# శరవేగంగా బుడమేరు గండి పూడ్చివేత

**వర్షం పడుతున్నా కొనసాగుతున్న పనులు**

**విజయవాడ,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్) :**

బుడమేరుకు గండి పడిన ప్రాంతంలో కుండపోతగా వర్షం కురుస్తోంది. అయితే వర్షం కురుస్తున్నప్పటికీ గండి పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయి. గండి పూడ్చుతూనే మరోవైపు నీటిని కట్టడి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మచిలీపట్నం నుంచి వచ్చిన బోట్లను బుడమేరు గండి పడిన ప్రాంతానికి తరలించారు. తాత్కాలికంగా రేకుల ద్వారా వరద నీటికి అడ్డుకట్ట వేయాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు గండి పడిన ప్రాంతానికి పెద్ద స్థాయిలో మిలిటరీ అధికారులు చేరుకున్నారు. 6వ మద్రాస్ మిలిటరీ బెటాలియన్ నుంచి వచ్చిన 120 మంది అధికారులు, జవాన్లు వచ్చారు. మరికొద్ది సేపట్లోనే మిలిటరీ ఆధ్వర్యంలో గండి పూడ్చివేత కార్యక్రమం మొదలుకానుంది. తాత్కాలికంగా రాడ్డులతో వంతెనల్లాగా నిర్మాణం చేసి దాంట్లో రాళ్లు వేసి పూడుస్తామని మిలిటరీ అధికారులు చెబుతున్నారు. ప్రణాళికలో భాగంగా మరి కొద్ది సేపట్లో బుడమేరు గండి పడిన ప్రాంతానికి మిలిటరీ అధికారుల సామాగ్రి చేరనుంది. మరోవైపు బుడమేరులో వరద ఉధృతి కొనసాగు తోంది. ఉదయం నుంచి రెండు మేర పెరిగిన నీటి ప్రవాహం మధ్యాహ్నానికి మరో రెండు అడుగులు పెరిగింది. దీంతో దాదాపు ఆరు కిలోమీటర్ల మేర రోడ్లు మునిగిపోయాయి. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద నీటితో నందివాడ మండలంలోని 12 గ్రామాలు జలదిగ్బంధంలో మునిగిపోయాయి. బుడమేరు వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో గురువారం ప్రజలు తమ నివాసాల్లోకి వెళ్లి బురదను శుభ్రం చేస్తున్నారు. అయితే ఈరోజు మళ్లీ వరద నీరు ఇంట్లోకి రావడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిరసన చేసిన గ్రేటా థన్‌బర్గ్ అరెస్టు

కోపెన్‌హాగన్ : గాజాపై ఇజ్రాయిల్ దాడికి నిరసనగా డెన్మార్క్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న పర్యావరణవేత్త గ్రేటా థన్‌బర్గ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. యూనివర్శిటీ ఆఫ్ కోపెన్‌హాగన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అరెస్టు జరిగింది. స్టూడెంట్స్ అగైనెస్ట్ ది ఆక్యుపేషన్ అనే విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాలను దిగ్బంధించారు. ఇజ్రాయెల్ యూనివర్సిటీలను బహిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. పాలస్తీనాపై దాడులు కొనసాగుతున్న సమయంలో కోపెన్‌హాగన్ విశ్వవిద్యాలయం ఇజ్రాయిల్ విశ్వవిద్యాలయాలతో సహకరించడం నిలిపివేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, గ్రెటా అరెస్ట్‌పై పోలీసులు స్పందించలేదు. యూనివర్శిటీ ఆఫ్ కోపెన్‌హాగన్‌లో జరిగిన కార్యక్రమంలో కేవలం ఆరుగురిని మాత్రమే అరెస్టు చేసినట్లు పోలీసు అధికార ప్రతినిధి తెలిపారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# వందలాదిగా కార్లు నీటిలో మునక

**బుడమేరు వరదలతో భారీ నష్టం**

**రిపేర్లు, ఇన్సూరెన్స్ కోసం నానా తంటాలు**

**విజయవాడ,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా విజయవాడ నగరాన్ని భారీ వరదలు ముంచెత్తాయి. కృష్ణానది, బుడమేరు ఉగ్రరూపం దాల్చి విజయవాడ అల్లకల్లోలం అయ్యింది. ఇళ్ల మొదటి అంతస్తు వరకూ నీరు చేరి గత వారం రోజులపాటు ప్రజలు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి కొంతమేర నష్టాన్ని తగ్గించగలిగారు. అయితే వరదలకు ప్రాణనష్టంతో పాటు ఆస్తి నష్టం కూడా భారీగానే జరిగింది. ముఖ్యంగా ఇంటి సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోయాయి. వీటితోపాటు వేల సంఖ్యలో కార్లు నీట మునిగి దెబ్బతిన్నాయి. దీంతో వాటి రిపేర్లకు యజమానులు నానా అవస్థలు పడుతున్నారు. బుడమేరు పొంగి వరదలు భారీగా రావడంతో వాహనాలు దాదాపు వారం రోజులపాటు నీటిలోనే ఉండిపోయాయి. మరికొన్ని వాహనాలు అయితే వరద ధాటికి ఇంటి నుంచి దూరంగా కొట్టికుపోయాయి. ఇంకొన్ని కార్లు తల్లకిందులుగా పడిపోయి అలానే నీటిలో ఉండిపోయాయి. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోకి వస్తుండడంతో కార్ల యజమానులు వాటిని స్టార్ చేసేందుకు ప్రయత్నించగా.. అవి మొరాయిస్తున్నాయి. అయితే స్టార్ కాకపోవడంతో వాటిని రిపేర్ చేయించేందుకు యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో కారు మరమ్మతుకు కనిష్ఠంగా రూ.70వేలు గరిష్ఠంగా రూ.లక్ష వరకూ ఖర్చవుతుందని షోరూమ్ యజమానులు చెప్పడంతో నోరెళ్ల బెడుతున్నారు. ఇప్పుడిప్పుడే వరదలు తగ్గి కుదుటపడ్డామని అనుకుంటున్న సమయంలో మరో దెబ్బ తగిలిందని వరద బాధితులు వాపోతున్నారు. విజయవాడ వరద ప్రభావ ప్రాంతాల్లో వరదనీరు తగ్గి వాహనాలు బయటపడుతున్నాయి. ఎటుచూసినా చెల్లాచెదురుగా పడి ఉన్న వాహనాలు దర్శనమిస్తున్నాయి. వరద ఉధృతి తగ్గి సాధారణ పరిస్థితులు ఏర్పడడంతో వాహనదారులు వాటిని తీసుకుని షోరూమ్‌లకు వెళ్తున్నారు. అతి కష్టం మీద కార్లను ట్రక్‌లపై గొలుసులతో కట్టి మరీ తరలిస్తున్నారు. అయితే అక్కడ వారు చెప్పే మాటలు విని యజమానులు నోరెళ్లబెడుతున్నారు. మరమ్మతులకు లక్షల్లో ఖర్చవుతుందని, రూ.12లక్షల నుంచి రూ.కోటి వరకూ విలువ చేసే కార్లకు కనీసం రీసేల్ ధర కూడా రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వారంతా ఆందోళన గురవుతున్నారు. అయితే పోరూమ్‌లకు వెళ్లిన కార్ల యజమానులకు పోరూమ్ మేనేజర్లు కొన్ని సలహాలు ఇస్తున్నారు. మరమ్మతులకు లక్షల్లో ఖర్చు అయ్యే అవకాశం ఉందని, వీటిని రిపేర్ చేసినా లాంగ్ డ్రైవ్‌లకు వెళ్లినప్పుడు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని చెప్తున్నారు. ఇన్సూరెన్స్ లేని వాహనాలకు సైతం తమ వంతు కర్తవ్యంగా ఆర్థిక భారం పడకుండా చూస్తామని హామీ ఇస్తున్నారు. అయితే రిపేర్ చేసేందుకు భారీగా ఖర్చయ్యే అవకాశం ఉండడంతో వాటిని అమ్మేయడమే మేలని కొంతమంది వాహనదారులు ఆలోచిస్తున్నారు.

## పిసిసి అధ్యక్షుడిగా ఎన్నో మధురస్మృతులు ఉన్నాయి

**తనపై సోనియా ఉంచిన నమ్మకాన్ని నిజం చేసిన**

**కొత్త పీసీసీ చీఫ్ మహేశ్‌కు పూర్తి అండగా ఉంటానన్న రేవంత్**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బాధ్యతలను మహేష్ కుమార్ గౌడ్‌కి అప్పగించడం ఆనందంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ పూర్తి విశ్వాసంతో తనను పీసీసీ చీఫ్ చేశారని గుర్తు చేసుకున్నారు. తన పదవీకాలంలో అత్యంత విలువైన జ్ఞాపకాలున్నాయని, రాహుల్ గాంధీ చేసిన భారత్ జోడోయాత్ర మరవలేనిదని వ్యాఖ్యానించారు. టీపీసీసీ చీఫ్‌గా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ హైకమాండ్ నియమించిన విషయం తెలిసిందే. దీంతో పీసీసీ బాధ్యతలకు దూరమైన సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగంగా స్పందించారు. తన కాలంలో చేసిన పనులను ఆయన గుర్తు చేసుకున్నారు. తన పదవీకాలాన్ని గుర్తు చేసుకుంటే గర్వంగా ఉందంటూ ఎమోషనల్ అయ్యారు. తనకు సహకరించిన పార్టీ నేతలకు, పార్టీ సైనికులకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఇక క్లిష్ట పరిస్థితుల్లో భారీగా పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్ డ్రైవ్ చేశామని అన్నారు. తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభను సీఎం గుర్తచేసుకున్నారు. తుక్కుగూడ సభ చరిత్రలో అతిపెద్ద ఎన్నికల సమావేశాలలో ఒకటని ఆయన వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చెబుతున్న అబద్దాలు, కల్పితాలు, వైఫల్యాలను బహిర్గతం చేయగలిగామని రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగామని ప్రస్తావించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందించారు.

## ప్రజలకు కెసిఆర్ వినాయక చవితి శుభాకాంక్షలు

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలని గణనాథున్ని ఈ సందర్భంగా కేసీఆర్ ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తి శ్రద్ధలతో వినాయకున్ని ప్రార్థించి దేవ దేవుని అనుగ్రహం పొందాలని కేసీఆర్ తెలిపారు.

## లోన్‌యాప్ వేధింపులకు విద్యార్థి ఆత్మహత్య

**మేడ్చల్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

లోన్‌యాప్ వేధింపులకు యువకుడు బలైన ఘటన మేడ్చల్ జిల్లాలో చోటు చేసుకుంది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుత్బుల్లాపూర్, సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన ఎంకే విద్యార్థి భాను ప్రకాష్ (22) కనిపించడం లేదంటూ గురువారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయ్యింది. ఆరోరా కళాశాలలో మాస్టర్స్ చదువుతున్న భాను ప్రకాష్ లోన్‌యాప్ ద్వారా లోన్ తీసుకున్నాడు. అయితే తిరిగి లోన్ చెల్లించకపోవడంతో లోన్ యాప్ నిర్వాహకులు వేధింపులకు గురిచేశారు. తీసుకున్న లోన్ కట్టాల్సిందే అంటూ లోన్‌యాప్ పట్టుబట్టారు. దీంతో లోన్‌ఆప్స్ వేధింపులు తాళలేక భాను, నిన్న సాయంత్రం ఫాక్స్ సాగర్ చెరువులో దూకి బలన్మరణానికి పాల్పడ్డాడు. మొబైల్ లొకేషన్ ద్వారా స్నేహితులు భాను ప్రకాష్ ఆచూకీని కనుగొన్నారు. చెరువు వద్దకు వెళ్లి చూడగా అతని దుస్తులు, వాహనం గట్టుపై ఉండటంతో

పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పెట్ బషీరాబాద్ పోలీసులు యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు... లోన్ యాప్‌కు సంబంధించిన చాటింగ్‌ను పరిశీలిస్తున్నారు. లోన్‌యాప్ నిర్వహకుల వేధింపులకు భాను ప్రకాష్ ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో సంజయ్‌గాంధీ నగర్‌లో విషాదం అలముకుంది.

## తండ్రయిన హీరో నితిన్

**పండట్టి బిడ్డకు జన్మనిచ్చిన షాలిని**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

అభిమానులకు నటుడు నితిన్ శుభవార్త చెప్పారు. తండ్రి అయ్యానంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. నితిన్ భార్య షాలిని పండంటి బాబుకు జన్మనిచ్చారు. చిన్నారి చెయ్యి ఫొటోను పంచుకుంటూ.. 'మా ఫ్యామిలీ న్యూ స్టార్‌కు ఆహ్వానం' అని నితిన్ క్యాప్షన్ పెట్టారు. సినీ ప్రముఖులు సమంత, వెంకీ అట్లూరి తదితరులు, అభిమానులు, పలువురు నెటిజన్లు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 2020లో షాలినిని వివాహం చేసుకున్నారు నితిన్. గతేడాది 'ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మ్యాన్'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన నితిన్ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు', వెంకీ కుడుముల డైరెక్షన్‌లో 'రాబిన్‌హుడ్' చిత్రాల్లో నటిస్తున్నారు. వినోదం, సందేశంతో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న 'రాబిన్‌హుడ్'ను డిసెంబరు 20న విడుదల చేయనున్నట్టు దర్శక, నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు.

## వరదబాధితులకు జిఎంఆర్ రెండున్నర కోట్ల విరాళం

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణలోని వరద బాధితులను ఆదుకునేందుకు ప్రముఖులతోపాటు పలు సంస్థలూ ముందుకొస్తున్నాయి. ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు ప్రకటిస్తున్నాయి. తాజాగా జీఎంఆర్ గ్రూప్ రూ.2.5 కోట్లు విరాళం ఇచ్చింది. కెమిలాయిడ్స్, అపోలో ఆస్పత్రి, శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం, విర్కో ఫార్మా, ఆర్.వి.ఆర్ ప్రాజెక్ట్స్ సంస్థలు రూ.కోటి చొప్పున విరాళం ప్రకటించాయి. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చెక్కులు అందజేశారు.

## జగన్ లండన్ పర్యటన వాయిదా ?

**డిప్లమాట్ పాస్‌పోర్ట్ రద్దు**

**సాధారణ పాస్‌పోర్ట్ కోసం ఎదురుచూపు**

**ఐదేళ్ల పాస్‌పోర్టు ఇవ్వాలని కోర్టుల పిటిషన్**

**విచారణ సోమవారానికి వాయిదా**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి మూడో తేదీన కుటుంబసమేతంగా లండన్ వెళ్లాల్సి ఉన్నా..ఆయన ఇంకా వెళ్లలేదు. ఏడో తేదీన వెళ్తారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి . కానీ ఆ రోజున కూడా వెళ్లే అవకాశం లేదని తెలుస్తోంది. దీనికి కారణం పాస్ పోర్టు ఇంకా చేతిలోకి రాకపోవడమే. అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న ఆయన పాస్ పోర్టును కోర్టులో సబ్ మిట్ చేయాల్సి ఉంటుంది. కోర్టు పర్మిషన్ ఇచ్చినప్పుడు తీసుకుని మళ్లీ సమయం ముగిశాక కోర్టులోనే సబ్ మిటీ చేయాలి. జగన్ 2019లో సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో ఆయన డిప్లొమాట్ పాస్ పోర్టుకు అర్హత సాధించారు. తన అసలు పాస్ పోర్టును రద్దు చేసుకుని డిప్లొమాట్ పాస్ పోర్టు తీసుకున్నారు. ముఖ్యమంత్రిగా ఎప్పుడు రాజీనామా చేశారో అప్పుడు డిప్లొమాట్ పాస్ పోర్టు ఆటోమేటిక్‌గా రద్దయిపోతుంది. దీంతో విదేశీ పర్యటనకు వెళ్లేందుకు జగన్ తనకు పాత పాస్ పోర్టును ఐదేళ్లకు పునరుద్ధరించాలని సీబీఐ కోర్టులో పిటిషన్ వేశారు. అయితే కోర్టు ఆయన విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చినప్పటికీ.. ఐదేళ్ల కాలానికి పాస్‌పోర్టు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. ఏడాది మాత్రమే చెల్లుబాటయ్యే పాస్ పోర్టును ఇవ్వాలని తెలిపింది. అయితే జగన్ ఈ ఒక్క ఏడాది పాస్ పోర్టుతో సంతృప్తి చెందలేదు. తనకు ఐదేళ్ల పాస్ పోర్టు కావాల్సిదేనని ఆయన పై కోర్టులో అప్పీల్ చేసినట్లుగా తెలుస్తోంది. దీనిపై విచారణ పూర్తి కాలేదు. సోమవారానికి వాయిదా పడింది. సోమవారం కోర్టులో వచ్చే తీర్పును అనుసరించి ఆయన విదేశీ పర్యటన తేదీలను ఖరారు చేసుకునే అవకాశం ఉంది. ఈ నెల ఇరవై ఐదో తేదీ వరకే సీబీఐ కోర్టు లండన్‌లో పర్యటించడానికి అనుమతి ఇచ్చింది. జగన్ కుమార్తెలు లండన్ లో ఉంటున్నారు. వారిలో ఒకరి పుట్టిన రోజు వేడుకల కోసం సీబీఐ కోర్టు నుంచి అనుమతి తీసుకున్నా... కోర్టు అనుమతి రాకపోవటం, పాస్ పోర్టు రెన్యూవల్ ఆలస్యం కాబోతుండటంతో మాజీ సీఎం జగన్ లండన్ టూర్ వాయిదా పడినట్లయింది. జగన్మోహన్ రెడ్డికి లండన్ వెళ్లడానికి ఐదేళ్ల పాటు పాస్ పోర్టు ఎందుకని.. వెళ్లి వచ్చిన తర్వాత కావాలంటే పొడిగింపు కోసం పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు కదా అన్న సందేహాన్ని టీడీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. జగన్ మోహన్ రెడ్డి లండన్ వెళ్తే మళ్లీ తిరిగి వస్తారా లేదా అన్న అనుమానాలు కూడా టీడీపీ నేతలు వ్యక్తం చేస్తూంటారు. ఈ కారణంగా ఈ పాస్ పోర్టు వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. వాస్తవానికి వైఎస్ జగన్ 3న సతీసమేతంగా లండన్ బయల్దేరి వెళ్లాలని అనుకున్నారు. ఇందుకు సీబీఐ ప్రత్యేక కోర్టు ఇటీవల అనుమతి కూడా ఇచ్చింది. కుమార్తె పుట్టినరోజు వేడుకల కోసం 25 దాకా అక్కడే ఉండాలని భావించారు.

## టూ వీలర్‌ను ఢీకొన్న లారీ

**ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం**

**కాకినాడ,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్) :**

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువు వద్ద 216 నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పెద ఉదయపురం గ్రామానికి చెందిన రోనంకి ప్రవీణ్ కుమార్ (20), పల్నాడు జిల్లా పుత్తూరు మండలం సవల్యాపురం గ్రామానికి చెందిన చింతా కార్తీక్ (19) తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై దివాన్ చెరువుకు బయలుదేరారు.బొగ్గు లారీ వేగంగా వచ్చి దివాన్‌చెరువు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్రవాహనాన్ని కొద్దిదూరం లారీ ఈడ్చుకుపోవడంతో శరీర భాగాలు రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఘటనా స్థలాన్ని బమ్మూరు పోలీస్‌స్టేషన్ పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## భరత్‌పుజా నదిపై వంతెన పునఃనిర్మాణం

**హిందువలు మనోభావాలు దెబ్బతీసే నిర్ణయం**

**మెట్రో మ్యాన్ శ్రీధరన్ అభ్యంతరం**

**తిరువనంతపురం,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

కేరళలోని ఓ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ఆ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టారు మెట్రో మ్యాన్ శ్రీధరన్. భరత్‌పుజా నదిపై తిరువనయ- తవనూర్ వంతెన పునఃనిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలించడంపై రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. నదీ తీరంలో ఉన్న దేవాలయాల పవిత్రత దెబ్బతినకుండా వంతెన నిర్మాణం చేపట్టాలన్నారు. సెప్టెంబర్ 8 నుంచి మొదలు కానున్న ఈ వంతెన మార్గాన్ని వ్యతిరేకిస్తూ కేరళ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. భరత్‌పుజా నదిపై నిర్మించనున్న వంతెన మార్గాన్ని ఈ శ్రీధరన్ వ్యతిరేకిస్తున్నారు. ఇరువైపులా ఉన్న ఆలయాలను ఆ వంతెన వేరు చేస్తుందని, అది హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుందని వాదిస్తున్నారు. ఆ అలైన్‌మెంట్ మార్చేందుకు ఉచితంగా తాను సేవలందిస్తానని.. ఒక అవకాశం ఇస్తే దాన్ని ఎలా నిర్మించాలో చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానంటూ ముఖ్యమంత్రితోపాటు సంబంధిత మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. కానీ, అటువైపు నుంచి స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు.

## అంచం అడిగితే ఫిర్యాదు చేయండి

**విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖి**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన సిబ్బంది లేదా అధికారులు లంచం అడిగితే తమకు తెలియజేయాలని సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖి తెలిపారు. ఈ మేరకు సీఎండీ కార్యాలయంలో అవినీతి ఫిర్యాదులు స్వీకరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. లంచం అడిగితే 040 - 2345 4884 లేదా 7680901912 నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చని ఓ ప్రకటనలో తెలిపారు. మా సంస్థ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి అత్యున్నత ప్రమాణాలను పాటిస్తోంది. కొంతమంది సిబ్బంది, అధికారులు అవినీతికి పాల్పడుతూ సంస్థకు చెడ్డపేరు తెస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారుల సమస్యలు/ఫిర్యాదులు నేరుగా తీసుకొని వాటికి పరిష్కరించి అక్రమాలను అడ్డుకునేందుకు ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఉద్యోగులు వినియోగదారులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించినా, విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా సహించేది లేదు'అని సీఎండీ ముషారఫ్ పేర్కొన్నారు. ఇప్పటికే నూతన సర్వీసుల మంజూరు, కేటగిరి మార్పు, టైటిల్ ట్రాన్స్‌ఫర్, బిల్లింగ్ లోపాలు ఇతర సేవలు పొందేందుకు సంస్థ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో అవకాశం కల్పించినట్లు చెప్పారు.

## నగరంలో పలుచోట్ల భారీ వర్షం

**కుండపోత్ వానతో వాహనదారుల ఇక్కట్లు**

**హైదరాబాద్,సెప్టెంబర్6(పీపుల్స్ మోటివేషన్):**

ఇటీవలే కురిసిన భారీ వర్షాలతో తడిసి ముద్దయిన భాగ్యనగరం హైదరాబాద్‌లో మళ్లీ భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల సమయంలో జడివాన కురిసింది. నగరవ్యాప్తంగా వర్షం పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందుల పడ్డారు. నాంపల్లి, లక్డీకపూల్, మాసబ్ ట్యాంక్ ప్రాంతాల్లోనైతే కుండపోత వర్షం పడిందిది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మెహదీపట్నం, టోలిచౌకీ, షేక్‌పేట్, ఫిలింనగర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్, హఫీజ్‌పేట్‌లలో కూడా వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్‌లో వాతావరణం కాస్త పొడిగానే కనిపించింది. అయితే ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉదయం ఎండగా ఉన్నప్పటికీ సాయంత్రానికి పరిస్థితి మొత్తం మారిపోయింది. అనూహ్యంగా భారీ వర్షం పడడంతో మహానగరం హైదరాబాద్‌లో మళ్లీ ట్రాఫిక్ సమస్య మొదలైంది. ఎక్కడికక్కడ రోడ్లపై వరద పారుతుండడంతో వాహనదారులు నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. ముఖ్యంగా ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులు ఇంటికి వెళ్లే సమయం కావడంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంది. శనివారం వినాయక చవితి నేపథ్యంలో ఆ సందడి కూడా నగరంలో కనిపిస్తోంది. ఇందుకు సంబంధించిన పనులకు కూడా వర్షం ఆటంకంగా మారింది.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శనివారం । సెప్టెంబర్ । 7 । 2024


# భారత్ చేరిన వెంటనే న్యూజిలాండ్ బిగ్ స్కెచ్..

న్యూజిలాండ్ క్రికెట్ జట్టు ప్రస్తుతం భారత పర్యటనలో ఉంది. గ్రేటర్ నోయిడాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో నిర్వహించే ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్ సెప్టెంబర్ 9 నుంచి 13 వరకు జరగనుంది. ఆసియాకు వచ్చిన తర్వాత, న్యూజిలాండ్ ఇద్దరు వెటరన్ కోచ్‌లను తన జట్టులో భాగంగా చేసుకుంది. కివీ జట్టు ఆసియాలో రాబోయే మూడు టెస్టు మ్యాచ్‌లను దృష్టిలో ఉంచుకుని శ్రీలంక మాజీ స్పిన్నర్ రంగనా హెరాత్‌ను స్పిన్ బౌలింగ్ కోచ్‌గా నియమించింది. అతను సక్లైన్ ముస్తాక్ స్థానంలో వచ్చాడు. టెస్టుల్లో 433 వికెట్లతో హెరాత్ టెస్టు ఫార్మాట్‌లో అత్యంత అనుభవజ్ఞుడైన స్పిన్నర్‌లలో ఒకడిగా నిలిచాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో టెస్టు మ్యాచ్ ఆడిన తర్వాత న్యూజిలాండ్ శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. బ్లాక్‌క్యాప్‌లు అక్కడి దేశవాళీ బౌలర్‌ను తమ జట్టులో భాగంగా చేసుకోవడానికి ఇదే కారణం అంటున్నారు. నోయిడాలో జరగనున్న టెస్ట్ మ్యాచ్ కోసం న్యూజిలాండ్ తన జట్టులో టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్‌ను కూడా చేర్చుకుంది. ఇటీవలే టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా రాథోడ్ పదవీకాలం ముగిసింది. టీ20 ప్రపంచకప్ 2024 టైటిల్‌ను భారత్ గెలుచుకోవడంలో అతను కీలక పాత్ర పోషించాడు. హెరాత్, రాథోడ్‌లు జట్టుకు కొత్త సమాచారాన్ని అందించడమే కాకుండా దేశీయ పరిస్థితులపై కూడా అవగాహన కల్పిస్తారని బ్లాక్‌క్యాప్స్ కోచ్ గ్యారీ స్టెడ్ అన్నారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. హెరాత్, రాథోడ్‌లు మా టెస్ట్ గ్రూప్‌లో చేరినందుకు చాలా సంతోషిస్తున్నాం. ఇద్దరు ఆటగాళ్లు క్రికెట్ ప్రపంచంలో ఎంతో గౌరవం ఉంది. మా ఆటగాళ్లు వారి నుంచి నేర్చుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని నాకు తెలుసు. ఉపఖండంలో మూడు టెస్టు మ్యాచ్‌ల్లో రంగనాతో కలిసి పనిచేసే అవకాశం రావడం మా ముగ్గురు ఎడమచేతి ఆర్థోడాక్స్ స్పిన్నర్లకు, ముఖ్యంగా ఇజాజ్, మిచ్, రాచిన్‌లకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. గాలెలో టెస్టు ఫార్మాట్‌లో రంగనా 100కు పైగా వికెట్లు పడగొట్టాడు. మా జట్టు ఈ మైదానంలో రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడుతుంది. అందువల్ల ఆ పిచ్‌పై అతని పరిజ్ఞానం అమూల్యమైనది' అంటూ చెప్పుకొచ్చాడు.








## మెంటార్‌గా గంభీర్ స్థానంలో ఎవరు?



బిసిసిఐ ప్రతి ఏడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ కి ఏ రేంజ్ లో క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఏకంగా వరల్డ్ క్రికెట్లోనే రిచెస్ట్ క్రికెట్ లీగ్ గా కొనసాగుతోంది ఐపీఎల్. ఈ క్రమంలోనే ఐపిఎల్ లో ఆడేందుకు దేశ విదేశాల నుంచి ఆటగాళ్లు తరలివస్తూ ఉంటారు. ఐపీఎల్ లో పాల్గొంటే భారీగా ఆదాయంతో పాటు ఇక ఎంతో మంది స్టార్ట్ ప్లేయర్లతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకునే అవకాశం కూడా వస్తుంది. దీంతో మంచి అనుభవాన్ని కూడా సాధించవచ్చు. అందుకే ఎంతో మంది స్టార్ ప్లేయర్స్ ఐపీఎల్ లో పాల్గొంటూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు వరకు ఐపీఎల్ హిస్టరీలో కొన్ని టీమ్స్ ఛాంపియన్ జట్టుగా కొనసాగుతున్నాయ్. అలాంటి వాటిలో ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఈ రెండు టీమ్స్ అందరికంటే ఎక్కువసార్లు ఐపీఎల్ టైటిల్ గెలుచుకొని టాప్ లో ఉన్నాయి. ఈ రెండు టీమ్స్ తర్వాత ఇక ఎక్కువ టైటిల్స్ గెలుచుకున్న జట్లలో అటు కోల్కతా నైట్ రైడర్స్ జట్టు ఒకటి ఉంది అన్న విషయం తెలిసిందే . ఈ ఏడాది జరిగిన ఐపీఎల్ సీజన్ లోను ఏకంగా ఐపీఎల్ టైటిల్ విజేతగా నిలిచింది. గౌతమ్ గంభీర్ మెంటార్గా ఉండగా అతని సలహాలతో అద్భుతంగా రాణించిన కోల్కతా జట్టు అదరగొట్టేసింది అని చెప్పాలి. కానీ ఈ ఏడాది ఐపీఎల్ సీజన్లో కోల్కత్తా జట్టు మెంటార్గా వ్యవహరించిన గౌతమ్ గంభిర్ ఇక ఇప్పుడు టీమిండియా హెడ్ కోచ్గా వ్యవహరించెందుకు ఛాన్స్ రావడంతో.. చివరికి మెంటర్ బాధ్యతలకు స్వస్తి పలికేసాడు. దీంతో గంభీరు స్థానంలో ఎవరు రాబోతున్నారు అనే విషయంపై చర్చ జరుగుతూ ఉంది. అయితే కోల్కతా నైట్ రైడర్స్ మెంటర్ గా శ్రీలంక మాజీ క్రికెటర్ సంఘకర నియామకం కానున్నట్లు క్రీడా వర్గాల నుంచి సమాచారం. ప్రస్తుతం ఆయన రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ గా ఉన్నారు.

## పాక్‌కు మరో షాక్?

ఒకప్పుడు వరల్డ్ క్రికెట్లో ఛాంపియన్ టీం గా కొనసాగిన పాకిస్తాన్ జట్టు పరిస్థితి ఇక రోజు రోజుకు అధ్వానంగా మారిపోతోంది అన్న విషయం తెలిసిందే. ఒకప్పుడు ఐసిసి టోర్నీ జరుగుతుంది అంటే చాలు టైటిల్ ఫేవరెట్ గా బరిలోకి దిగిన పాకిస్తాన్ జట్టు ఇక ఇప్పుడు..చివరికి వరల్డ్ కప్ లో ఆడాలి అంటే క్వాలిఫైయర్ మ్యాచ్లో ఆడాల్సిన పరిస్థితి వచ్చింది. అంతలా ఆ జట్టు ఆట తీరు అధ్వానంగా మారిపోయింది అని చెప్పాలి. ఏకంగా చిన్న చిన్న టీమ్స్ చేతుల్లో సైతం దారుణమైన ఓటమి చవిచూస్తూ విమర్శలు ఎదుర్కొంటుంది పాకిస్తాన్ జట్టు. ప్రపంచ శ్రేణి బౌలర్లు బ్యాట్స్మెన్లు జట్టులో ఉన్నప్పటికీ ఎందుకో ఆ జట్టు ఆట తీరు మాత్రం తీవ్రంగా నిరాశ పరుస్తూ ఉంది. ఇక జట్టులోని ఆటగాళ్ళ మధ్య సఖ్యత లేకపోవడమే.. ఇలా టీం వైఫల్యానికి కారణం అన్నది ఈ మధ్యకాలంలో వెలుగులోకి వస్తున్న ఘటన ద్వారా అర్థమవుతుంది. అయితే ఈ ఏడాది జరిగిన టి20 వరల్డ్ కప్ టోర్నీలో నెదర్లాండ్స్ చేతిలో ఓడిపోయి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న పాకిస్తాన్ ఇటీవల బంగ్లాదేశ్ చేతిలోనూ దారుణమైన పరాజయాన్ని చవిచూసింది. రెండు మ్యాచ్ల టెస్ట్ సిరీస్ కి గాను బంగ్లాదేశ్పాకిస్తాన్ పర్యటనకు రాగా.. చిన్న టీం బంగ్లా చేతిలో పాకిస్తాన్ రెండు మ్యాచ్ లలో ఓడిపోయి క్లీన్ స్వీప్ అయింది. క్రికెట్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒక దేశ పర్యటనకు వెళ్లి ఆ దేశాన్ని టెస్టుల్లో ఓడించి బంగ్లాదేశ్ మొదటి సారి క్లీన్స్వీప్ చేసింది. అయితే ఇప్పటికే ఇలా వైట్ వాష్ అయ్యి ఎదురు దెబ్బ తిన్న పాకిస్తాన్ కు మరో బిగ్ షాక్ తగిలింది.

## బంగ్లా ఆల్ రౌండర్‌పై ట్రోల్స్

ఇటీవలే పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్ జట్టు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. టెస్టు సిరీస్‌లో తొలిసారి పాకిస్థాన్‌ను ఓడించింది. బంగ్లాదేశ్ ఈ చారిత్రాత్మక ఫీట్‌లో షకీబ్ అల్ హసన్ కీలక సహకారం అందించాడు. అయితే రెండో టెస్టుకు ముందు అతడు జట్టు నుంచి తప్పుకునే ప్రమాదం ఏర్పడింది. బంగ్లాదేశ్‌లో అతనిపై హత్య కేసు నమోదు కావడమే దీనికి కారణం. అయితే, అతని ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు సిరీస్ తర్వాత చర్యలు తీసుకోవాలని చెప్పుకొచ్చింది. ఇప్పుడు సిరీస్ ముగియడంతో షకీబ్ తిరిగి తన దేశానికి వెళ్లకుండా ఇంగ్లండ్ వెళ్లాడు. హత్యకేసులో జైలుకు వెళ్తానన్న భయంతోనే ఇంగ్లండ్‌కు పారిపోయారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాకిస్థాన్‌ను ఓడించిన బంగ్లాదేశ్ జట్టు సంబరాల్లో బిజీగా ఉంది. అయితే, షకీబ్ అల్ హసన్ ఇంగ్లాండ్‌కు బయలుదేరాడు. అక్కడ ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటాడు. ఆ తర్వాత టెస్టు సిరీస్‌కు ముందు నేరుగా భారత్‌లో బంగ్లాదేశ్ జట్టుతో చేరనున్నాడు. షకీబ్‌పై బంగ్లాదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న హత్య కేసులో జైలుకు వెళతాడనే భయంతో ఇంగ్లాండ్‌కు వెళ్లడంలో ఎలాంటి అర్థం లేదని తెలుస్తోంది. భారత్‌తో జరిగే కీలక సిరీస్‌కు ముందు అతను తీవ్రంగా ప్రాక్టీస్ చేయాలనుకుంటున్నాడు. టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన తర్వాత బంగ్లాదేశ్ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం తారాస్థాయికి చేరుకుంది. బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హసన్ శాంటో కూడా ఏ జట్టునైనా ఓడించగల సత్తా ఉందని చెప్పుకొచ్చాడు. సెప్టెంబరు 19 నుంచి భారత్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌ను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్ లాగానే ఈ సిరీస్‌లో షకీబ్‌కు కూడా అనుభవం అవసరమని, అది అతనికి కూడా తెలుసు. బహుశా అందుకే అతను విశ్రాంతి తీసుకోకుండా ఇంగ్లాండ్‌లో ప్రాక్టీస్ చేయాలని నిర్ణయించుకున్నాడు అని తెలిపాడు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# చిత్రసీమకు మరో వారసుడు

**ఎంట్రీ ఇచ్చిన బాలయ్య తనయుడు మోక్షజ్ఞ**



నందమూరి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన సమయం వచ్చేసింది. బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ సినీరంగ ప్రవేశం చేశారు. యంగ్ ప్రశాంత్ వర్మ బాలయ్య కుమారుడిని వెండితెరకు పరిచయం చేయనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ పోస్ట్ పెట్టారు. 'సింబా ఈజ్ కమింగ్' అంటూ మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా సినిమాలో ఆయన లుక్‌ను విడుదల చేశారు. దీంతో అభిమానులు విషెస్ చెబుతున్నారు. తొలి సినిమాకు ఆల్ ది బెస్ట్ చెబుతూ కామెంట్స్ చేస్తున్నారు.రెండు రోజులుగా ప్రశాంత్ వర్మ వరుస పోస్ట్‌లతో మోక్షజ్ఞ ఎంట్రీ గురించి హింట్ ఇస్తూ వచ్చారు. 'నా యూనివర్స్ నుంచి త్వరలోనే ఓ కొత్త తేజస్సు రానుంది', 'వారసత్వాన్ని ముందుకుతీసుకెళ్లే అద్భుత క్షణం' అంటూ వరుస పోస్ట్‌లు పెట్టారు. తాజాగా మోక్షజ్ఞ లుక్‌ను పంచుకొని తన తర్వాత సినిమా హీరో అంటూ బాలయ్య వారసుడిని పరిచయం చేశారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రెండో ప్రాజెక్ట్‌గా రానున్న సినిమాలో మోక్షజ్ఞ అలరించనున్నారు.  తన సినిమాటిక్ యూనివర్స్‌కు సంబంధించి ప్రస్తుతం 20 స్క్రిప్ట్‌లు సిద్ధమవుతున్నాయని.. తొలి ఫేజ్‌లో ఆరుగురు సూపర్ హీరోల సినిమాలు తీస్తామని గతంలో ప్రశాంత్ వర్మ వివరించారు. ఏడాదికి ఒక సినిమా కచ్చితంగా విడుదల చేస్తానని ఆయన చెప్పారు. ఇప్పుడు ఈ సినిమా కథ ఏమై ఉంటుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# హీరో రాజ్ తరుణ్, లావణ్య కేసులో బిగ్ ట్విస్ట్

**లావణ్యతో రాజ్‌తరుణ్ పదేళ్లు సహజీవనం చేసినట్లు గుర్తింపు**



హీరో రాజ్ తరుణ్, లావణ్య కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. రాజ్ తరుణ్ తనకు కావాలని లావణ్య చెబుతోంది. మరోవైపు పోలీసులు ఈ కేసులో రాజ్ తరుణ్ నిందితుడేనని చెబుతున్నారు. రాజ్ తరుణ్, లావణ్య పదేళ్ల పాటు సహ జీవనం చేశారని కూడా పోలీసులు చెబుతున్నారు. రాజ్‌తరుణ్–లావణ్య కేసులో పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఛార్జ్‌షీట్‌లో రాజ్‌తరుణ్‌ను పోలీసులు నిందితుడిగా చేర్చారు. లావణ్యతో రాజ్‌తరుణ్ పదేళ్లు సహజీవనం చేసినట్లు పేర్కొన్నారు. పదేళ్లపాటు రాజ్‌తరుణ్–లావణ్య ఒకే ఇంట్లో ఉన్నారని చార్జిషీట్‌లో తెలిపారు. లావణ్య చెబుతున్న దాంట్లో వాస్తవాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. లావణ్య ఇంటి వద్ద పోలీసులు సాక్ష్యాలు సేకరించారు. ఇప్పటికే ఈ కేసులో రాజ్‌తరుణ్ ముందస్తు బెయిల్ తీసుకున్నాడు. అయితే ఈ విషయమై ఏబీఎన్‌తో లావణ్య మాట్లాడుతూ.. రాజ్ తరుణ్‌పై ఛార్జ్ షీట్ దాఖలు చేయడం శుభ పరిణామమని తెలిపింది. తనను ఎన్నో మాటలు అన్నారని.. చివరికి న్యాయం గెలుస్తుందని తాను భావిస్తున్నానని పేర్కొంది. రాజ్ తరుణ్‌కి వ్యతిరేకంగా వెళ్లాలని తనకు లేదని తెలిపింది. తనకు రాజ్ తరుణ్ కావాలని పేర్కొంది. రాజ్ తరుణ్ ఇంటి నుంచి వెళ్లిపోయిన తర్వాత మానసికంగా ఎంతో బాధపడ్డానని వెల్లడించింది. శేఖర్ భాష అనే వ్యక్తిని అస్త్రంగా ఉపయోగించి తనపై ఎన్నో నిందలు వేశారని లావణ్య పేర్కొంది.÷రాజ్ తరుణ్ శిక్ష అనుభవించాలని తాను కోరుకోను, కానీ తనకు న్యాయం చేయాలని కోరుకుంటున్నానని వెల్లడించింది. రాజ్ తరుణ్, తాను పదేళ్లపాటు కలిసి సంసారం చేశామనేది అనేది వాస్తవమని లావణ్య తెలిపింది. వాటికి సంబంధించిన ఆధారాలన్నీ పోలీసులకు ఇచ్చానని వెల్లడించింది. హీరోయిన్ మాల్వి మల్హోత్రా వల్ల తనను రాజ్ తరుణ్ వదిలించుకోవాలని చూశాడని పేర్కొంది. కేసును తప్పుదోవ పట్టించాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారని తెలిపింది. మాల్వి మల్హోత్రా రాజ్ తరుణ్ ఇద్దరికీ ఫ్గ÷ర్ ఉందని మరోమారు లావణ్య తెలిపింది. వాటికి సంబంధించిన ఆధారాలను సైతం పోలీసులకు ఇచ్చానని లావణ్య వెల్లడించింది.



# మనం మేందు జాగ్రత్త పడాలి

**క్యాస్టింగ్ కౌచ్‌పై ఆదాశర్మ**

ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ అంశంపై అదా శర్మ స్పందించారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. ఎప్పుడైన క్యాస్టింగ్ కౌచ్‌ను ఎదుర్కొన్నారా..? అన్న ప్రశ్నకు తనదైన శైలిలో సమాధానం చెప్పారు. 'నిజం చెప్పాలంటే.. నేను నేల మీదనే కూర్చున్నాను.. సోఫా(కౌచ్)లో కూర్చోవాలని అనుకోలేదు' అన్నారు. 'మనం సినిమాల్లో యాక్షన్ సన్నివేశాల్లో నటించేటప్పుడు ఎంత వేగంగా ప్రతిస్పందిస్తామో.. ఎవరైనా మనతో తప్పుగా ప్రవర్తించాలని చూస్తే అంతే వేగంగా కనిపెట్టాలి. ఆ సమయంలో మనం ఏం చేయాలనేదానిపైనే దృష్టి పెట్టాలి. పక్కవారి అభిప్రాయాలను తీసుకోకూడదు. ఏ రంగంలోనైనా సపోర్ట్ నెట్‌వర్క్ కలిగి ఉండడం ముఖ్యం. నాకు మద్దతు ఇచ్చేవారు ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నందుకు సంతోషిస్తున్నాను' అని వివరించారు. 2008 నుంచి ప్రారంభమైన తన సినీ ప్రయాణంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నట్లు అదా వివరించారు. ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురైనప్పటికీ ధైర్యంగా ముందుకు సాగినట్లు చెప్పారు. 'హార్ట్ ఎటాక్'తో తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టారు నటి అదాశర్మ. 'సన్నాఫ్ సత్యమూర్తి', 'గరం', 'క్షణం', 'కల్కి' చిత్రాల్లో నటించారు. గతేడాది విడుదలైన 'కేరళ స్టోరీ' ఆమెకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. అదా నటించిన 'ది గేమ్ ఆఫ్ గిర్గిత్' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

# నాని, వివేక్ ఆత్రేయ కాంబోలో మరో మూవీ






ఇటీవలే సరిపోదా శనివారం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని. ఆగస్టు 29న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన వస్తోంది. నాని, వివేక్ ఆత్రేయ కాంబోలో వచ్చిన చిత్రం అంటే సుందరానికి. ఈ చిత్రం ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయింది. అయితే రెండోసారి వచ్చిన సరిపోదా శనివారం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది.  ఇదిలా ఉంటే నాని, వివేక్ ఆత్రేయ ముచ్చటగా మూడో సినిమా చేయబోతున్నారా..? అంటే తాజా అప్‌డేట్ అవుననే చెబుతోంది. ఈ మూవీ సక్సెస్ మీట్‌లో నాని మాట్లాడుతూ.. సినిమాను విజయవంతం చేసిన అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశాడు. అంతేకాదు తాను వివేక్ ఆత్రేయతో మరో సినిమా కూడా చేయబోతున్నానని ప్రకటించాడు. రాబోయే సినిమా కామెడీ బ్యాక్ డ్రాప్‌లో ఉండబోతుందని కూడా చెప్పి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాడు. ఈ కామెంట్స్‌తో నానిని ఇక ఫుల్ లెంగ్త్ కామెడీ రోల్‌లో చూసేయొచ్చని తెగ సంబరాలు చేసుకుంటున్నారు అభిమానులు, మూవీ లవర్స్. నాని ఇప్పటికే హిట్ 3 సినిమా ప్రకటించాడని తెలిసిందే. హిట్ ఫ్రాంఛైజీలో శైలేష్ కొలను డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం మే 1 2025లో గ్రాండ్‌గా విడుదల కానుంది. మరోవైపు దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో సినిమా చేయబోతుండగా.. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది.

# సినీ గేయరచయిత వడ్డేపల్లి కృష్ణ కన్నుమూత

ప్రముఖ సినీ గీత రచయిత వడ్డేపల్లి కృష్ణ–76 కన్నుమూశారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. రెండు రోజుల క్రితమే ఆయన తెలుగు సినీ రచయితల సంఘం ఆయన్ని జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించింది. వడ్డేపల్లి కృష్ణ సిరిసిల్లలో చేనేత కుటుంబంలో జన్మించారు. హైదరాబాద్ నాగోల్‌లో స్థిరపడ్డారు. తొలుత పోస్టుమెన్ ఉద్యోగం చేశారు. 'పిల్ల జమీందార్' చిత్రంలో 'నీ చూపులోన విరజాజి వాన', 'భైరవ ద్వీపం' చిత్రంలో అంబా శాంభవి లాంటి ఆణిముత్యాల్లాంటి పాటలను రచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జయ జయహే తెలంగాణ నృత్య రూపకం రచించగా అన్ని వేదికలపైనా ఆ నృత్య రూపకం మార్మోగింది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు వడ్డేపల్లి. దర్శకుడిగా రెండు సినిమాలు చేశారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఎక్కడికి వెళ్తుందో మనసు' చిత్రంలో సాయికుమార్ హీరోగా నటించారు. బలగం సినిమాలో  స్వయంగా నటించారు. ఆయన దర్శకత్వం వహించి నిర్మించిన గోభాగ్యం షార్ట్ ఫిల్మ్‌కి అంతర్జాతీయంగా పలు పురస్కారాలు దక్కాయి. సి. నారాయణ రెడ్డి ఏంటో ఇష్టపడే వ్యక్తి  రచయిత వడ్డేపల్లి కృష్ణ. బతుకమ్మ, రామప్ప రమణీయం లాంటి అనేక లఘు చిత్రాలకు నంది పురస్కారాలు అందుకున్నారు. పది వేల లలిత గీతాలను పరిశీలించి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆయన రాసిన వందల్లో లలిత గీతాలను ఆకాశవాణి, దూరదర్శన్‌లో ప్రసారమయ్యాయి. 40కి పైగా నృత్య రూపకాలు రాశారు. ఎన్నో పుస్తకాలు ప్రచురించారు. వడ్డేపల్లి కృష్ణ మరణం పట్ల సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# ఐశ్వర్య లక్ష్మి లుక్ నెట్టింట వైరల్



సాయి దుర్గ తేజ్ హనుమాన్ మేకర్స్ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ రోహిత్ కేపీ దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నాడు. కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే మొదలైంది. మేకర్స్ చాలా రోజుల తర్వాత కొత్త అప్‌డేట్ అందించారు.  తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా వస్తోన్న ఈ మూవీలో ఐశ్వర్య లక్ష్మి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఐశ్వర్యలక్ష్మికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. వసంత పాత్ర లుక్ షేర్ చేశారు. నిర్మానుష్య ప్రదేశంలో కనిపిస్తున్న ఐశ్వర్య లక్ష్మి లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. 1947 హిస్టరీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో సాయి తేజ్ ఒక యోధుడి పాత్రలో నటిస్తున్నట్టు ఫిలిం నగర్ సర్కిల్ టాక్. ప్రస్తుతం ఈమూవీ  షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో కొనసాగుతోంది.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com